www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -78 గురువారం 2 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఆదాయం పెంచండి

**చేజింగ్ సెల్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలి**

**అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**



**హైదరాబాద్((ప్రజావినికిడి):** ఆదాయం పెంపు, నిధుల సమీకరణపై నిర్లక్ష్యం వీడాల్సిందేనని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్‌లో ఆదాయ సమీకరణపై సీఎం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై దృష్టి సారించాలని అన్నారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ నిధుల సమీకరణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని ఆదేశించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్‌తోపాటు ఇతర శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఆదాయ సమీకరణకు సంబంధించి చేజింగ్ సెల్ ఏర్పాటు చేసుకుని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనుకుంటున్న స్థాయిలో పని చేయాలంటే శాఖల వారీగా సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని చెప్పారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్దిదారుల జాబితాను నేరుగా నగదు బదిలీ (డీబీటీ)కి అనుసంధానం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు, ఇతర పనులు పూర్తి చేసేందుకు అనుగుణంగా బడ్జెట్‌ను తయారు చేసుకోవాలని అన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని వివరించారు. ఊహాజనిత బడ్జెట్ కాకుండా వాస్తవికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించుకోవాలని చెప్పారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

## అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యం

2లో.

# మావిగన్ కు కట్టుబడి ఉన్నా




**వచ్చే ఎన్నికలు 'మావిగన్ వర్సెస్ అమరావతి'.. చూసుకుందాం: జగన్**

**మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని వ్యాఖ్య**

**ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టీకరణ**

**అమరావతి(ప్రజావినికిడి):** ఏపీ రాజధాని అమరావతిని వైసీపీ అధినేత జగన్ మరోసారి తిరస్కరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము మావిగన్ కే కట్టుబడి ఉన్నామని... వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి అని ఆయన అన్నారు. మావిగన్ ప్రతిపాదనకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని చెప్పారు. ఈ రెండు రాజధానుల్లో ప్రజల మద్దతు దేనికి ఎక్కువగా ఉందో వచ్చే ఎన్నికల్లో తేలిపోతుందని అన్నారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'జగన్ అమరావతికి వ్యతిరేకం' అంటూ కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని చెప్పారు

మిగతా 2లో.



## ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్ బాధ్యతలు..

**ముందు దేశానికి..**

**ఆ తర్వాత తల్లిదండ్రులకు..**

**ఆర్మీ చీఫ్ ఎమోషనల్ మూమెంట్**

**31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన జనరల్ ధీరజ్ సేథ్**

**మాజీ లెఫ్టినెంట్ జనరల్ అయిన తండ్రికి సెల్యూట్**

**అనంతరం తల్లి ఆశీర్వాదం తీసుకున్న ఆర్మీ చీఫ్**

**ఈ భావోద్వేగ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్**

భారత సైన్యం 31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్ సేథ్ తొలి రోజే అందరినీ కదిలించే భావోద్వేగ క్షణానికి కారణమయ్యారు.

మిగతా 2లో.



## ఏపీ ఎప్‌సెట్ 2026 ఫలితాలు విడుదల

**ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన నారా లోకేశ్**

**ఇంజినీరింగ్ విభాగంలో 70.52 శాతం విద్యార్థులు క్వాలిఫై**

**అగ్రికల్చర్ అండ్ ఫార్మా విభాగంలో 89.59 శాతం ఉత్తీర్ణత**



**అమరావతి(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎప్పుడెప్పుడా అని ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ఫలితాలను విడుదల చేశారు.

మిగతా 2లో.

## ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు

**సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలు**

**ఆర్థిక శాఖ ఉద్యోగుల ఖాతాల్లో నగదు జమ**

**ఇకపై 25లోగా జీతాల బిల్లులు సమర్పించాలని ఆదేశాలు**

**ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగుల్లో ఆనందం**



**హైదరాబాద్ (ప్రజావినికిడి):** రాష్ట్రంలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ నెల ఒకటో తేదీనే వారి జీతాలను ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న

మిగతా 2లో.

## పాలనపై చర్చకు సిద్ధం..

**దమ్ముంటే తేదీ, స్థలం, సమయం చెప్పు**

**సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ప్రతిసవాల్**

**ప్రభుత్వ వైఫల్యాలు నిరూపించకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా**

**అబద్ధాలు ఆపి (ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు)**




**హైదరాబాద్ (ప్రజావినికిడి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వైఫల్యాలు, రైతన్నల దుస్థితి, వ్యవసాయ సంక్షోభం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వంటి ఏ అంశంపైనైనా ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. దమ్ముంటే తేదీ, స్థలం, సమయం చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ప్రతిసవాల్ విసిరారు. వరంగల్, హైదరాబాద్‌లో

మిగతా 2లో.

# ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకెళ్లాలి -కేంద్రీయ వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పిలుపు**

**అనంతపురం (ప్రజావినికిడి):** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురములో జరిగిన ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ , రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ , రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , కేంద్రీయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డా. శంకరఆచార్య, ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కో[illegible] పాల్గొన్నారు.

మిగతా 2లో.




# హద్దుమీరితే ఆటకట్టిస్తాం

**సోషల్ మీడియా దుర్వినియోగంపై పవన్ హెచ్చరిక!**

**వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయొద్దని పవన్ హెచ్చరిక**

**ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు సహించబోమని స్పష్టం**

**సైబర్ వేధింపుల బాధితుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు**

**ఆధారాలతో ఫిర్యాదు చేస్తే బీఎన్ఎస్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు**

**అమరావతి (ప్రజావినికిడి):** సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఒకరి హక్కులను మరొకరు హరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును స్వాగతిస్తామని, కానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సహించబోమని స్పష్టం చేశారు. మత విశ్వాసాలను దెబ్బతీయడం రాజ్యాంగం కల్పించిన హక్కు కాదని పవన్ అన్నారు.

మిగతా 2లో.



# మావిగన్ కు కట్టుబడి ఉన్నా

**మొదటిపేజీ తరువాయి**

అమరావతి పేరుతో చంద్రబాబు సాగిస్తున్న స్కామ్‌లను, అవినీతిని మాత్రమే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అవినీతి లేని రాజధాని కావాలనేదే తన ఆకాంక్ష అని, అందుకే ఈ మావిగన్ ప్రతిపాదనను తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ సరికొత్త ప్రతిపాదనకు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకే ఓటు వేస్తారని, వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టం చేశారు.

### బీచ్‌లను కూడా మద్యం కేంద్రాలుగా మారుస్తారా?: జగన్

"కుటుంబాలు, చిన్నారులతో కలిసి ప్రశాంతంగా గడిపే బీచ్‌లను కూడా చంద్రబాబు ప్రభుత్వం వదలడం లేదు. బీచ్ షాక్స్ పేరుతో కొత్త మద్యం సంస్కృతికి తెరలేపుతోంది" అంటూ వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్ర సామాజిక వాతావరణాన్ని పూర్తిగా చెడగొట్టేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తే, రేపు సామాన్య కుటుంబాలు బీచ్‌లకు ఎలా వెళ్తాయని కూటమి సర్కార్‌ను నిలదీశారు.

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, వేధింపులకు గురిచేయడం, చివరకు లాకప్ డెత్‌లకు పాల్పడటం వంటి దారుణాలు రాష్ట్రంలో జరుగుతున్నాయని జగన్ ఆరోపించారు. చంద్రబాబుకు అసలు మానవత్వం ఉందా? అని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెట్టుబడులను ఆకర్షించే చేతగాని ఈ ప్రభుత్వం... కేవలం అవినీతి, దోపిడీ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని దుయ్యబట్టారు. "రాష్ట్రానికి కొత్తగా విదేశీ పెట్టుబడులు రావడం లేదు కానీ, ఇక్కడ దోచుకున్న సొమ్ము మాత్రం విదేశాలకు వెళ్తోంది" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# ఏపీ ఎప్‌సెట్ 2026 ఫలితాలు విడుదల

రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ విభాగంలో మొత్తం 2,76,572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా... వారిలో 2,58,545 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,82,317 మంది (70.52 శాతం) విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. అలాగే, అగ్రికల్చర్ అండ్ ఫార్మా విభాగంలో 79,231 మంది దరఖాస్తు చేసుకోగా... 70,929 మంది పరీక్ష రాశారు. ఈ విభాగంలో ఏకంగా 63,546 మంది అంటే 89.59 శాతం మంది విద్యార్థులు క్వాలిఫై అయి మంచి ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలో క్వాలిఫై అయిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎప్‌సెట్ పరీక్షల్లో టాప్ ర్యాంకర్లు వీరే:

ఇంజినీరింగ్:
జొన్నల రోషన్ మణిదీప్ రెడ్డి – గుంటూరు
కోరుకొండ శ్రావ్య – శ్రీకాకుళం
వెన్న ప్రవీణ్ కుమార్ రెడ్డి – పల్నాడు
తుంగ దుర్గా సుప్రభాత్ – పల్నాడు
తెల్లూరి శ్రేయస్ రెడ్డి – హైదరాబాద్
ముక్కార సాకేత్ – కడప
బండి వెంకట సాత్విక్ – గుంటూరు
నూర్ బాషా హఫీజ్ – గుంటూరు
పసల మోహిత్ – కడప
మరక వంశీధర్ రెడ్డి – కడప.

అగ్రికల్చర్ అండ్ ఫార్మా:
శంబంగి జశ్వంత్ నాయుడు – విజయనగరం
కుడుముల వెంకట మహంత్ అక్షజ్ రెడ్డి – మేడ్చల్ మల్కాజ్‌గిరి
కొండ్రెడ్డి హారికాదేవి శ్రీ అనూహ్య – కృష్ణా
కర్రి సత్యనారాయణ – కాకినాడ
బంటు ధాత్రిక – అనకాపల్లి
పల్లికొండ దర్శితేజ – కాకినాడ
వల్లెపు ధీరజ్ కృష్ణ – గుంటూరు
దండమూడి జాగృతి – గుంటూరు
ఆళ్ల శ్రీలక్ష్మి సత్యసాయి నిఖితారెడ్డి – పల్నాడు
రేలంగి జయ షణ్ముఖి – విజయనగరం.

# అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యం

### ట్రాఫిక్ తదితర సమస్యలపై చెక్ పెట్టే సాంకేతికత

### సిఎం రేవంత్‌తో భేటీ అయినా మేఘా కృష్ణారెడ్డి

### అన్‌లాగ్ సిఇవో అలెక్స్ కిప్‌మాన్




**హైదరాబాద్,(ప్రజావినికిడి):**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్టక్చర్ సంస్థ ఎండీ పి. కృష్ణారెడ్డి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమావేశమయ్యారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ, హైదరాబాద్ మెట్రోరైల్ అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి పాల్గొన్నారు.అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో భవిష్యత్తరాలకు అవసరమైన మేధోపరమైన మౌలిక సదుపాయాలు, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ఆలోచనలను సమావేశంలో వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వారు సమావేశంలో వివరించారు. గరంలో అత్యాధునిక ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫామ్స్ వినియోగం వల్ల ప్రయోజనాలను తెలిపారు.సెన్సర్లు, రోబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సురక్షితమైన, సమర్థవంతమైన, వేగంగా స్పందించే పట్టణ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎలా తోడ్పుతుందన్న అంశాలను వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి తదనుగుణంగా సిగ్నళ్ల వ్యవస్థ, నీటి లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వినియోగాన్ని నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు మార్గం సుగమం చేయడం వంటి కాగ్నిటివ్ సిటీస్ రూపకల్పనకు ఉన్న విస్తృత అవకాశాలను సమావేశంలో సమావేశంలో వివరించారు. వేగంగా పెరుగుతున్న పట్టణాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ప్రభుత్వాల కార్యనిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పౌరులకు అందించే సేవలను మరింత మెరుగుపరచడం, అలాగే డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళికకు ఎలా దోహదపడతాయో ఇరు సంస్థలు వివరించాయి. సందర్భంగా ముఖ్యమంత్రి ఇటు సంస్థలకు పలు సూచనలు చేశారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేలా ఎఐ కి అనుసంధానించాలని సీఎం సూచించారు. మావేశం అనంతరం ముఖ్యమంత్రి గారి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్త భాగస్వామ్యంతో అవగాహన ఒప్పందం కుదిరింది. పరస్పరం సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ఒప్పందం కీలకంగా మారుతుంది.

# ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్ బాధ్యతలు..

**'మొదటిపేజీ తరువాయి**

గార్డ్ ఆఫ్ ఆనర్' స్వీకరించిన అనంతరం ఆయన నేరుగా తన కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లారు. మాజీ లెఫ్టినెంట్ జనరల్ అయిన తండ్రి కె.ఎం.సేథ్‌కు సైనిక సెల్యూట్ చేశారు.అంతటితో ఆగకుండా తల్లి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేసింది. మరో విశేషం ఏంటంటే.. భారత నౌకాదళంలో రియర్ అడ్మిరల్‌గా ఉన్న ఆయన సోదరుడు రవ్నీష్ సేథ్ కూడా కొత్త ఆర్మీ చీఫ్‌కు సెల్యూట్ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అంతకుముందు జనరల్ ధీరజ్ సేథ్ జాతీయ యుద్ధ స్మారక స్థూపం వద్ద అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం అధికారికంగా ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. దేశ భద్రత, సార్వభౌమత్వ పరిరక్షణ కోసం పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని స్పష్టం చేశారు.

# హద్దుమీరితే ఆటకట్టిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తిగత దూషణలు, చంపేస్తామని బెదిరించడం, దేవుళ్లు, దేవతలపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. నిర్మాణాత్మక విమర్శలను ప్రభుత్వం ఎప్పుడూ స్వాగతిస్తుందని చెప్పారు.

సైబర్ వేధింపులు, పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ పేర్కొన్నారు. నేరస్థులకు కులం, మతం ఉండదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బాధితులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.'నేరస్థులకు, నేరానికి కులం, మతం, రాజకీయ పార్టీలు ఉండవు. తప్పు చేసి...కులం, మతం, ప్రాంతం, రాజకీయాల వెనక దాక్కోలేరు. చట్టం ముందు ప్రతి పౌరుడూ సమానమే. నేరం చేసిన ప్రతి ఒక్కరిపైనా చట్ట ప్రకారం చర్యలుంటాయి. సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఈ పోరాటంలో వారు ఒంటరులు కాదు. డిప్యూటీ సీఎం కార్యాలయంలో దీనిపై ఫిర్యాదుల వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. స్క్రీన్ షాట్స్, లింక్స్, వీడియోలు లేదా ఏదైనా డిజిటల్ ఆధారాలతో బాధితులు అక్కడ ఫిర్యాదు చేయవచ్చు. అవసరమైతే సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త చట్టం తెస్తాం" అని ఆయన తెలిపారు.

# బండి భగీరథ్ పోక్సో కేసు.. బాధితురాలికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**

పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తనపై నమోదు చేసిన కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, ఎలాంటి తప్పూ చేయలేదని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని భగీరథ్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు.అయితే బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే ముందు బాధితురాలి వాదన కూడా వినాల్సి ఉందని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని బాధితురాలికి నోటీసులు జారీ చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో బండి భగీరథ్‌పై మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. అనంతరం పరారైన అతణ్ని మే 16న పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు.ఇంజినీరింగ్ పరీక్షలు రాసేందుకు వీలుగా ఈ నెల 20 నుంచి 24 వరకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. గడువు ముగియడంతో గత వారం మళ్లీ చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రస్తుతం రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు ఎల్లుండి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# పాలనపై చర్చకు సిద్ధం..

**మొదటిపేజీ తరువాయి**

అసెంబ్లీ, బోధి పెవిలియన్, ప్రెస్‌క్లబ్, అశోక్‌నగర్ చౌరస్తా ఎక్కడికైనా తానే స్వయంగా వస్తానని చెప్పారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనపైనా, రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గణాంకాలతో సహా నిరూపించడంలో తాను విఫలమైతే అక్కడికక్కడే రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ దివాలా తీసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబం, మంత్రులు, కాంగ్రెస్ నేతల దోపిడీ వల్లే తెలంగాణ దివాలా తీస్తున్నదని విమర్శించారు. ఢిల్లీకి పోతే ఇజ్జత్ లేదంటున్న రేవంత్ రెడ్డి, 72 సార్లు ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు.

కేసీఆర్ హయాంలో అప్పుల గురించి రేవంత్ రెడ్డి నిత్యం అబద్ధాలు చెప్తున్నారని అన్నారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2023 వరకు తెలంగాణ అప్పు రూ.3.50 లక్షల కోట్లని పార్లమెంటులో కేంద్రం చెప్పిందన్నారు. ఇందులో ఉమ్మడి రాష్ట్రం నుంచి వచ్చిన అప్పు రూ.72 వేల కోట్లు, కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ.2.78 లక్షల కోట్లని వివరించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ. 8.11 లక్షల కోట్లు అప్పు చేశారంటూ నిత్యం అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అప్పులే కాకుండా రాష్ట్ర ఆదాయంతోపాటు అప్పులకు కడుతున్న వడ్డీ లెక్కలపైనా సీఎం తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం చెప్పింది నమ్మాలా?, కాగ్ చెప్పింది నమ్మాలా?అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతాంగానికే రూ.1.13 లక్షల కోట్లు ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు. రైతు బంధు ఇవ్వకుండా, సంపూర్ణ రుణమాఫీ చేయకుండా, కౌలు రైతులకు, రైతు కూలీలకు చెప్పిన ఆర్థిక సహాయం చేయలేదన్నారు. రైతాంగానికి బాకీ పడ్డ రూ.1.13 లక్షల కోట్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఎకరానికీ రైతుభరోసా ఆశీర్వాద సభలు నిర్వహిస్తున్నారని అన్నారు. రైతాంగానికి, విద్యార్థులకు, మహిళలకు, రిటైర్డ్ ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించడానికి డబ్బులు లేవు కానీ రాహుల్ గాంధీకి మాత్రం రూ.వెయ్యి కోట్లు ఇస్తానంటూ రేవంత్‌రెడ్డి చెప్తున్నారని తెలిపారు.

ఆ డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. డబ్బుల్లేవంటూనే రూ.200 కోట్లతో సీఎం క్యాంపు కార్యాలయాన్ని నిర్మించుకున్నారని అన్నారు. యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అబద్ధాలు మాట్లాడ్డం ఆపి ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టిపెట్టాలని హితవు పలికారు. రాష్ట్రం గురించి అడ్డగోలుగా మాట్లాడి ప్రజల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దని కోరారు. రానున్న రోజుల్లో బాహుబలి సినిమాలో భల్లాల దేవునికి పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. ఆయన నమ్మిన హిట్లర్‌కి ఎలాంటి ముగింపు కలిగిందో అలాంటి ముగింపునే ప్రజలు రేవంత్ రెడ్డి రాజకీయ జీవితానికి ఇస్తారని అన్నారు. ఆయన అభద్రతాభావంలో ఉన్నారని చెప్పారు. రూ.15 లక్షలు ఇస్తానని మోడీ, రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తానని రేవంత్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామన్నారు. కృష్ణా, గోదావరి జలాలను గురుదక్షిణ కింద చంద్రబాబుకు అప్పగించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. 280 ఎకరాల భూమిని కొల్లగొట్టేందుకు ప్రభుత్వం మెట్రో రైల్‌ను స్వాధీనం చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి, విప్ కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్యే ఏ జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులు తుంగబాలు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ రాకేశ్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**మొదటిపేజీ తరువాయి**




ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవం కేవలం ఒక వేడుక దినం మాత్రమే కాదని, ఈ యువ సంస్థ ప్రస్థానంలో ఇది ఒక కీలకమైన మైలురాయి అని అన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే సంస్థగా మారడానికి ఈ విశ్వవిద్యాలయం ఒక దీర్ఘకాలిక దార్శనికతను అభివృద్ధి చేసుకుందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పట్ల, ముఖ్యంగా నాణ్యమైన విద్యకు సంబంధించిన లక్ష్యాల పట్ల దీనికున్న నిబద్ధత, సమ్మిళిత, సమానత్వ అభివృద్ధి పట్ల బాధ్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆమె అన్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ఒక శ్రేష్ఠతా కేంద్రంగా ఆవిర్భవించి, 2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికత సాకారానికి గణనీయంగా దోహదపడుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

### సమాజానికి తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది

పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ ఈ స్నాతకోత్సవం వారి సంవత్సరాల అంకితభావం, పట్టుదల మరియు కఠోర శ్రమకు పరాకాష్ట అని అన్నారు. వారు కలలతో విశ్వవిద్యాలయంలో ప్రవేశించారు, మరియు ఈ రోజు వారు జ్ఞానం, ఆత్మవిశ్వాసం మరియు వారికి కొత్త అవకాశాల తలుపులు తెరిచే డిగ్రీతో బయటకు వెళు న్నారు.విద్యార్థుల విజయం వారి సొంత కఠోర శ్రమ ఫలితమే అయినప్పటికీ, అది వారి తల్లిదండ్రుల త్యాగాలు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, సమాజ మద్దతుతో కూడా రూపుదిద్దుకుందని రాష్ట్రపతి అన్నారు. అందువల్ల, సమాజానికి తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. వారు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కరణలను నడిపించే శాస్త్రవేత్తలుగా, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులుగా, లేదా సమాజ సేవ చేసే దాతలుగా మారినా, వారి విద్య అణగారిన వర్గాలకు బలంగా మారాలి.సాంకేతిక పురోగతులు ప్రతి రంగాన్ని మారుస్తున్నాయని రాష్ట్రపతి అన్నారు. ఇంత వేగంగా మారుతున్న ప్రపంచంలో, డిగ్రీ సంపాదించడంతో చదువు ముగిసిపోకూడదు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు నిరంతరం అనుగుణంగా మారే తపన విద్యార్థులకు గొప్ప బలాలలో ఒకటిగా ఉంటుంది. కొత్త ఆలోచనలను అన్వేషించడానికి, కొత్త జ్ఞానాన్ని సంపాదించడానికి ధైర్యాన్ని పెంపొందించు కోవాలని ఆమె వారికి సూచించారు. నేర్చుకోవాలనే తపన, పట్టుదల, నూతన ఆవిష్కరణలు చేసే మన యువత మన అమూల్యమైన జాతీయ సంపద అని రాష్ట్రపతి అన్నారు. తమ జ్ఞానాన్ని సృజనాత్మకత, పట్టుదల, బాధ్యతా భావంతో మేళవించడం ద్వారా, మన యువత సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని, మరింత సమ్మిళిత, సుసంపన్నమైన భారతదేశ నిర్మాణానికి దోహదపడగలరు.నైతిక విలువలను అలవర్చుకోవడం విద్యార్థులకు ఎంతో సహాయపడుతుందని రాష్ట్రపతి చెప్పారు. నిజాయితీ, కరుణ, సానుభూతి, ప్రకృతి పట్ల గౌరవం అనేవి కేవలం ఉన్నతమైన నైతిక ఆదర్శాలు మాత్రమే కాదని, అవి సంపూర్ణ అభివృద్ధికి పునాదులని ఆమె అన్నారు. ఈ గుణాలు వారి జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడానికి, సమాజానికి, దేశానికి అర్థవంతంగా తోడ్పడటానికి వీలు కల్పిస్తాయి.మన యువత యొక్క శక్తి, ప్రతిభ, నిబద్ధత ద్వారా మాత్రమే వికసిత భారత్ దార్శనికతను సాకారం చేసుకోగలమని రాష్ట్రపతి అన్నారు. వారు ఏ మార్గాన్ని ఎంచుకున్నా, అంకితభావంతో, నిజాయితీతో శ్రేష్ఠతను సాధించాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గోల్డ్ మెడల్ సాధించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు గోల్డ్ మెడల్ లను గౌరవ భారత రాష్ట్రపతి బహుకరించారు. అంతకుముందు గౌరవ భారత రాష్ట్రపతి గారిని, రాష్ట్ర గవర్నర్ గారిని, మంత్రి నారా లోకేశ్ గారిని, మంత్రి పయ్యావుల కేశవ్ గారిని ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కోరి శాలువా కప్పి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఆయా శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు

**మొదటిపేజీ తరువాయి**

సిబ్బందికి వేతనాలు జమయ్యాయి.గతంలో జీతాల చెల్లింపులో ఆలస్యం కావడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఏజెన్సీ సిబ్బందికి కూడా ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆర్థిక శాఖ జీతాల చెల్లింపును పూర్తి చేసింది.ఇకపై ప్రతి నెల 25వ తేదీలోగా జీతాల బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ విభాగాలకు పంపాలని, నెలలో చవరి పని దినానికల్లా ఆడిట్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్థిక శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# భారతదేశపు ప్రముఖ వాయిస్-ఫస్ట్ సోషల్ డిస్కవరీ ప్లాట్‌ఫారమ్ ఎఫ్‌ఆర్ఎన్‌డీ

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి) :** 28 ఏళ్ల ఇలక్కియా జీవితంలో భావోద్వేగ శ్రేయస్సు,ఆత్మీయ సహచర్యం,ఆర్థిక స్వావలంబన వైపు సాగుతున్న ప్రయాణం ఇంటరాక్ట్ గ్రూప్కు చెందిన భారతదేశపు ప్రముఖ వాయిస్-ఫస్ట్ సోషల్ డిస్కవరీ ప్లాట్‌ఫారమ్ 'ఎఫ్‌ఆర్‌ఎన్‌డీ ను పరిచయం చేసుకున్న తర్వాత కీలక మలుపు తిరిగింది.పుట్టిన వెంటనే ఇలక్కియా తన తల్లిని కోల్పోయింది. అనంతరం తనకు తల్లిదండ్రుల స్థానంలో అండగా నిలిచిన ఏకైక వ్యక్తి అయిన తండ్రి కూడా కోవిడ్-19 మహమ్మారి సమయంలో మరణించారు. దీంతో ఆమెకు తక్షణ కుటుంబ సభ్యులెవరూ లేకుండా పోయారు.ఆ తర్వాత ఆమె బంధువుల వద్ద నివసించినప్పటికీ, అక్కడ ఆమెకు కావాల్సిన భావోద్వేగ ఆదరణ,సొంత కుటుంబంలో ఉన్న అనుబంధ భావన లభించలేదు. చివరికి స్వతంత్రంగా జీవితం ప్రారంభించాలనే కఠినమైన నిర్ణయం తీసుకుని,తన సొంత ప్రయాణాన్ని ప్రారంభించింది. సామాజికంగా అందరితో కలవడానికి వెనుకంజ వేస్తూ, ముఖ్యంగా పురుషులతో మాట్లాడేందుకు తీవ్ర సంకోచం అనుభవించిన ఇలక్కియాకు రోజువారీ సామాజిక పరస్పర చర్యలు కూడా సవాలుగా మారాయి. జీవితంలో తనకు అత్యంత దగ్గరైన వారిని వరుసగా కోల్పోయిన తర్వాత, ఇతరులను మళ్లీ విశ్వసించడం ఆమెకు అంత సులభం కాదు. అలాంటి సమయంలోనే సోషల్ మీడియాలో ఎఫ్‌ఆర్‌ఎన్‌డీ గురించి ఒక వీడియో ఆమె దృష్టికి వచ్చింది. ఎలాంటి తీర్పులు లేకుండా స్వేచ్ఛగా మాట్లాడేందుకు, తన మాటను ఓర్పుగా వినే సురక్షిత వేదిక అనే ఆలోచన ఆమెను ఆకర్షించింది. దీంతో ఆమె ఆ ప్లాట్‌ఫారమ్‌లో చేరాలని నిర్ణయించుకుంది.ఈ వేదిక ద్వారా సంపాదించిన ఆదాయంతో ఆమె తన చదువును పూర్తిచేసి,ప్రస్తుతం న్యాయవాదిగా (అడ్వకేట్‌గా) వృత్తిని కొనసాగిస్తోంది. వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ విశేషమైన మార్పు సాధించిన ఆమె, తన జీవిత గమనాన్నే పూర్తిగా మార్చిన వేదికగా ఎఫ్‌ఆర్‌ఎన్‌డీకి కృతజ్ఞతలు తెలిపింది.

# ఏరువాక అగ్రి ఎక్సలెన్స్ అవార్డ్స్2026
# రైతు రక్ష వెబ్‌సైట్ ప్రారంభం

**నాంపల్లి,(ప్రజా వినికిడి):**
నవ నిర్మాణ్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఏరువాక అగ్రి ఎక్సలెన్స్ అవార్డ్స్2026 (2వ ఎడిషన్) కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో విశేష సేవలు అందించిన ప్రగతిశీల రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు,అగ్రి ఎంటర్ప్రెన్యూర్స్, సామాజిక సేవకులను అవార్డులతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా అన్నె సత్యనారాయణ, ఖర్జూరం రైతుకు ప్రగతి శీల రైతు అవార్డును బహుకరించారు. నవ నిర్మాణ్ ఫౌండేషన్ సీఈఓ పొన్నాన జగదీశ్వరరావు మాట్లాడుతూ, వ్యవసాయం పండుగలా ఉండాల్సిన సమయంలో ఎంతోమంది చిన్న, సన్నకారు రైతులు అప్పుల భారం, పంట నష్టాలతో తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత కొన్నేళ్లలో వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు అధికారిక నివేదికలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు.
ఇకపై ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకునే పరిస్థితి రాకూడదనే లక్ష్యంతో "రైతు రక్ష" అనే ప్రత్యేక క్రౌడ్ ఫండింగ్ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు



తెలిపారు. పంట నష్టపోయిన రైతులు తమ పంట వివరాలు, అవసరమైన వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుంటే, పరిశీలన అనంతరం క్రౌడ్‌ఫండింగ్ ద్వారా దేశవ్యాప్తంగా ఎవరైనా నేరుగా ఆ రైతు బ్యాంకు ఖాతాకు ఆర్థిక సహాయం అందించే విధంగా ఈ వేదిక పనిచేస్తుందని వివరించారు.
"ఒక్క రైతును కాపాడగలిగినా అదే మా ఫౌండేషన్‌కు అతిపెద్ద విజయం. రైతు ఒంటరివాడు కాదనే నమ్మకాన్ని ప్రతి రైతుకు కల్పించడమే 'రైతు రక్ష' కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు చేతనైన సహాయాన్ని అందించి రైతు కుటుంబాలకు అండగా నిలవాలని" పొన్నాన జగదీశ్వరరావు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైతులు, వ్యవసాయ నిపుణులు, సామాజిక ప్రముఖులు,వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ధరణి,భూ భారతి పోర్టల్ లలో అక్రమాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు..

**బాధ్యుల గుర్తింపు, కఠిన చర్యలు, నివారణ చర్యలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.. రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్..**



**హైదరాబాద్, (ప్రజావినికిడి):** ధరణి,భూ భారతి పోర్టళ్లలో వెలుగులోకి వచ్చిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్ తెలిపారు. ఈ అంశంపై బుధవారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు.



ధరణి పోర్టల్‌పై కొనసాగుతున్న ఫోరెన్సిక్ ఆడిట్ పురోగతిపై జరిగిన సమీక్షలో కొన్ని ఆందోళనకర అంశాలు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు లోకేష్ కుమార్ తెలిపారు.ధరణి పోర్టల్ సిస్టమ్ నిర్మాణంలో సహజసిద్ధమైన భద్రతా లోపాలు ఉన్నాయని, వాటిని కొందరు అక్రమ శక్తులు దుర్వినియోగం చేసి కొన్ని మాడ్యూళ్ల ద్వారా అనధికారిక ఎంట్రీలు చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు.
అలాగే నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ రూపొందించిన భూ భారతి పోర్టల్ కూడా ధరణి ఆధారిత సాంకేతిక నిర్మాణాన్ని అనుసరించడం వల్ల అదే తరహా లోపాలకు గురయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.ఆనాడు ధరణి పోర్టల్ ద్వారా మాడ్యూల్స్ రూపొందించిన వ్యక్తులే దీని వెనుక ఉన్నట్లుగా ప్రభుత్వం అనుమానిస్తుంది.
ఈ నేపథ్యంలో బాధ్యులను గుర్తించడం, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ప్రారంభించడం, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు సూచించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని వెల్లడించారు.
ఈ కమిటీలో సభ్యులుగా:
శ్రీ మిక్కిలినేని మను చౌదరి, ఐఏఎస్-కలెక్టర్, మేడ్చల్-మల్కాజిగిరి
శ్రీ ప్రతీక్ జైన్ (ప్రతీక్ జైన్), ఐఏఎస్-కలెక్టర్, సంగారెడ్డి
శ్రీ అనుదీప్ దురిశెట్టి,ఐఏఎస్ సంయుక్త కార్యదర్శి,ఐటీ & కమ్యూనికేషన్స్ శాఖ
శ్రీ హర్ష వర్ధన్, ఐపీఎస్- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో
శ్రీ అపూర్వ్ చౌహాన్,ఐఏఎస్ -ప్రాజెక్ట్ డైరెక్టర్, సీఎంఆర్ఓ
శ్రీ మంద మకరంద్, ఐఏఎస్-ప్రాజెక్ట్ ఆఫీసర్,ఐటీడీఏ, ఉట్నూర్
ఏ.సంపత్..
డీఎస్పీ,తెలంగాణ సీఐబీ,సైబర్ క్రైమ్స్
శ్రీమతి ఎం. సుభాషిణి.. డీఐజీ,రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ శాఖ
ఏ.శ్రీనివాస సుబ్బారావు.. సీనియర్ డైరెక్టర్ (ఐటీ),ఎన్ఐసీ
మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు, నేషనల్ ఇంఫార్మెటిక్ సెంటర్ పూర్తిగా కొత్తగా, అత్యున్నత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సరికొత్త సిస్టమ్ ఆర్కిటెక్చర్‌ను అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు.
ఈ కమిటీ 15 రోజుల్లోగా ప్రభుత్వానికి తమ నివేదికను సమర్పించనుందనిఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని లోకేష్ కుమార్ పేర్కొన్నారు. భూముల రికార్డుల భద్రత,సమగ్రత, పారదర్శకత విషయంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని స్పష్టం చేశారు.


# గ్లోబల్ స్టేజ్‌పై 'జక్కన్న' గర్జన..

**ఫ్రాన్స్‌లో దర్శకధీరుడు రాజమౌళికి అరుదైన గౌరవం**
**ఫ్రాన్స్ లో షాద్ నగర్ కు చెందిన రెహమాన్ కు ఆహ్వానం..**
**దర్శకుడు రాజమౌళిని ప్రశ్న అడిగిన రెహమాన్..**
**నిజాయితీతో కథ తీస్తున్నాను ప్రేక్షకులకు దగ్గర అవుతానన్న రాజమౌళి..**
**దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవం..**
**పారిస్‌లోని ప్రఖ్యాత 'సినెమాథెక్ ఫ్రాన్సైస్' సంస్థకు చెందిన చారిత్రక హెన్రీ లాంగ్లోయిస్ హాల్ లో ఆయన పేరిట ఒక 'శాశ్వత సీటు'**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
టాలీవుడ్ అపజయమెరుగని దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవం దక్కింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ప్రఖ్యాత 'సినెమాథెక్ ఫ్రాన్సైస్'సంస్థకు చెందిన చారిత్రక హెన్రీ లాంగ్లోయిస్ హాల్ లో ఆయన పేరిట ఒక 'శాశ్వత సీటు'ను కేటాయించారు. ఆస్కార్ గ్రహీత, దిగ్గజ ఫ్రెంచ్ దర్శకుడు కోస్టా గావ్రాస్ సమక్షంలో జక్కన్న ఈ సత్కారాన్ని అందుకున్నారు. ఈ చారిత్రక సంస్థలో రాజమౌళి చిత్రాల ప్రత్యేక ప్రదర్శన కూడా జరిగింది.ఈ కార్యక్రమానికి ఫ్రాన్స్ తెలుగు అంబాసిడర్ విద్యార్థి రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కు చెందిన
సీనియర్ జర్నలిస్ట్ ఎండి ఖాజాపాషా (కేపి)
కుమారుడు రెహమాన్ (సోనూ)కు నిర్వాహకులు ప్రత్యేక ఆహ్వానం పంపించారు. కార్యక్రమానికి హాజరైన రెహమాన్ ప్యారిస్ లోని చారిత్రాత్మక లీ గ్రాండ్ రెక్స్ థియేటర్లో త్రిబుల్ ఆర్,ఈగ సినిమాల ప్రత్యేక ప్రదర్శనకు యూరోప్ దేశాల సినీ తదితర ప్రముఖులతో కలిసి పాల్గొన్నారు. దర్శక ధీరుడు రాజమౌళిని తెలుగు విద్యార్థి రెహమాన్ ప్రశ్నలు అడిగే అవకాశం నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

**రాజమౌళిని రెహమాన్ ఇలా అడిగారు..**
"సార్,వారణాసి సినిమాను ప్రపంచవ్యాప్తంగా ప్రమోట్ చేస్తున్నారు. గ్లోబల్ ఆడియన్స్‌ను చేరుకోవడానికి ఈ సినిమాలో ఏమైనా ప్రత్యేకంగా మార్పులు చేశారా? మీ గత సినిమాలన్నీ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకే బలంగా అనుసంధానమై ఉంటాయి. వారణాసి విషయంలో దాన్ని ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారు?
అని రెహమాన్ ప్రశ్నించగా దానికి రాజమౌళి చాలా సరళంగా కానీ ఎంతో అర్థవంతంగా సమాధానం చెప్పారు.
దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ.. "నా బలం ఏంటో నాకు తెలుసు. నాకు బాగా తెలిసిన కథలనే, నాకు తెలిసిన ప్రపంచాన్నే నిజాయితీగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే నా విధానం.అదే ఇప్పటివరకు నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. అందుకే వారణాసి కోసం ప్రత్యేకంగా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని నా కథ చెప్పే విధానాన్ని మార్చడం లేదు. అదే నిజాయితీతో ఈ కథను కూడా చెబుతున్నాను. అదే ప్రపంచ ప్రేక్షకులతో మరోసారి కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను. అని రెహమాన్ కు రాజమౌళి సమాధానం ఇచ్చారు.ఈ సందర్భంగా అక్కడ జరిగిన కొన్ని విషయాలను ప్యారిస్ నుండి రెహమాన్ తెలియజేస్తూ..
ఈ సందర్భంగా రాజమౌళి ఎంతో బాగా స్పందించారని తెలియజేశారు.
ఇది తాను అస్సలు ఊహించని మధురమైన ఆశ్చర్యమని, జీవితాంతం గుర్తుండిపోతుందని ఉద్వేగానికి లోనయ్యారు.
భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా చాటిచెప్పిన దర్శకుల్లో ఎస్.ఎస్. రాజమౌళి అగ్రస్థానంలో నిలుస్తారనీ కెరీర్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఒక్క పరాజయం కూడా లేని ఏకైక అపజయమెరుగని దర్శకుడిగా ఆయన రికార్డు సృష్టించారు. రాజమౌళి సినిమా రూపకల్పనకు సమయం ఎక్కువ తీసుకున్నప్పటికీ, అది వెండితెరపైకి వస్తే బాక్సాఫీస్ రికార్డులు బద్దలవ్వడం ఖాయం.ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా రాబోతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు.ఈ తరుణంలోనే జక్కన్న ఖాతాలో మరో అంతర్జాతీయ స్థాయి అరుదైన గౌరవం చేరిందనీ రెహమాన్ వివరించారు.
ఇకపోతే ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న రాజమౌళిని అక్కడి ప్రతిష్టాత్మక ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ అత్యున్నత రీతిలో సత్కరించింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ప్రఖ్యాత 'సినెమాథెక్ ఫ్రాన్సైస్' సంస్థకు చెందిన చారిత్రక హెన్రీ లాంగ్లోయిస్ హాల్‌లో రాజమౌళి పేరిట ఒక 'శాశ్వత సీటు'ను కేటాయించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత,దిగ్గజ ఫ్రెంచ్ దర్శకుడు కోస్టా గావ్రాస్ ఆధ్వర్యంలో జక్కన్నకు ఈ అరుదైన గౌరవాన్ని అందించారు. ఈ చారిత్రక సంస్థలో రాజమౌళి రూపొందించిన చిత్రాలను ప్రత్యేకంగా ప్రదర్శించడం విశేషం.!

**ఉద్వేగానికి లోనైన రాజమౌళి**
తనకు దక్కిన ఈ అసాధారణ గౌరవంపై రాజమౌళి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. పారిస్ నగరంలో నా సినిమాలను ప్రదర్శించడమే కాకుండా,నన్ను ఇక్కడికి ఆహ్వానించడం ఒక గొప్ప గౌరవంగా



భావిస్తున్నాను. అయితే,హెన్రీ లాంగ్లోయిస్ హాల్‌లో నా పేరిట శాశ్వత స్థానాన్ని కల్పించడం నేను అస్సలు ఊహించని ఒక మధురమైన ఆశ్చర్యం.ఈ అనుభూతిని మాటల్లో వ్యక్తపరచడం నా వల్ల కావడం లేదు" అని పేర్కొన్నారు. ప్రపంచ సినిమా చరిత్రలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ సంస్థలో తనకు చోటు దక్కడం జీవితాంతం గుర్తుండిపోతుందని,భారతీయ సినిమాపై ఎంతో ఆదరణ చూపిన లెజెండరీజూ దర్శకుడు కోస్టా గావ్రాస్‌తో పాటు సినెమాథెక్ ఫ్రాన్సైస్ బృందానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**రెహమాన్ స్పందన**
ప్రపంచ వేదికపై తెలుగు సినిమా ఖ్యాతి
సినీ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత ఉన్న ఇలాంటి అంతర్జాతీయ సంస్థలో ఒక భారతీయ ప్రాంతీయ దర్శకుడికి శాశ్వత గౌరవం దక్కడం ఇదే మొదటిసారి కావడం విశేషం. రాజమౌళి సాధించిన ఈ అంతర్జాతీయ మైలురాయి పట్ల టాలీవుడ్ ప్రముఖులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు అని ప్యారిస్ తెలుగు అంబాసిడర్ రెహమాన్ పేర్కొంటున్నారు. బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ చిత్రాలతో గ్లోబల్ లెవెల్‌లో తెలుగు సినిమా జెండా పాతిన జక్కన్న, రాబోయే 'వారణాసి' చిత్రంతో ప్రపంచ సినిమాను ఏ రేంజ్‌లో షేక్ చేయబోతున్నారోనని నెటిజన్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారనీ తెలిపారు. ప్యారిస్ లో అద్భుతమైన ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## చిత్రపురి కాలనీ లో సినీ నటుడు
# డాక్టర్ ప్రభాకర్ రెడ్డికి ఘన నివాళి





**శంషాబాద్, (ప్రజావినికిడి): జూలై 01,**
సినీ వర్కర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు, నిర్మాత,దర్శకుడు కీర్తిశేషులు డా. ప్రభాకర్ రెడ్డి 91వ జయంతి వేడుకలు చిత్రపురి కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. ప్రభాకర్ రెడ్డి సతీమణి సంయుక్త ప్రభాకర్ రెడ్డి,ఆయన ఇద్దరు కుమార్తెలు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు సినీ ప్రముఖులు,సినీ కార్మికులు జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన సినీ రంగానికి, సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సంయుక్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, చిత్రపురి కాలనీ ఏర్పాటుకు, అభివృద్ధికి డా. ప్రభాకర్ రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ప్రస్తుతం ఐదు వేలకుపైగా కుటుంబాలు సంతోషంగా నివసిస్తున్నాయంటే అది ఆయన దూరదృష్టి, సేవాభావం వల్లేనని పేర్కొన్నారు. చిత్రపురి కాలనీలో డా. ప్రభాకర్ రెడ్డి పేరును నిలబెట్టి, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వల్లభనేని అనిల్ కుమార్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారానికి త్వరలోనే కృషి చేస్తామని, నిజమైన సినీ కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే, తనను పీఏసీ సభ్యురాలిగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంయుక్త ప్రభాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు..

### ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరిక..




**నాగోల్,(ప్రజావినికిడి):**
హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరించారు.
విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగోల్ ఎక్స్ రోడ్ వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు,ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు ఉపయోగించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఉల్లంఘించడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని, మైనర్లకు వాహనాలు ఇచ్చి డ్రైవింగ్ చేయించడం కూడా శిక్షార్హమైన చర్యేనని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
అలాగే,సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తెలియని వ్యక్తులు ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని హెచ్చరించారు. ఇటువంటి మోసాల వల్ల ఆర్థిక నష్టాలు సంభవించే అవకాశం ఉందన్నారు.
నగరంలో గంజాయి అలాగే ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లల ప్రవర్తన, స్నేహితులు,వెళ్లే ప్రదేశాలపై పర్యవేక్షణ అవసరమని తెలిపారు.
ప్రజల సహకారం లేకుండా నేరాల నియంత్రణ సాధ్యం కాదని, తమ పరిసరాల్లో గంజాయి విక్రయాలు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
"రోడ్లపై నిబంధనలు పాటించండి, హెల్మెట్ ధరించండి,ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించండి. మీ ప్రాణాలతో పాటు మీ కుటుంబ సభ్యుల భద్రత కూడా



మీ చేతుల్లోనే ఉంది. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుకోవచ్చు" అని డ్రగ్ కి దూరం గా ఉండి ఆరోగ్యాన్ని,సైబర్ నేరాలకు ద్రూరంగా ఉండి డబ్బులను, ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రాణాలను కాపాడు కోవాలి అని ఏసీపీ కృష్ణయ్య తెలిపారు.
ఈ కార్యక్రమంలో నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీతో పాటు ఎస్సై రమేష్,ఎస్సై ఉమ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీనగర్ కాలనీలో ఘనంగా
# 'మయూర హాస్పిటల్స్' నూతన బ్రాంచ్ ప్రారంభం

**జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సేవలు అందుబాటులోకి.. -జూలై 1నుంచి 5 వరకు రోగులకు ఉచిత కన్సల్టేషన్..**

**మందుల్లేని జీవితమే లక్ష్యంగా డేటా డ్రివెన్ హెల్త్‌కేర్:డాక్టర్ హను యెడ్లూరి**

**హైదరాబాద్,(ప్రజావినికిడి): జూలై 1**
శ్రీనగర్ కాలనీ జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీ (కేశవ నగర్)లో 'మయూర హాస్పిటల్స్' నూతన బ్రాంచ్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. అత్యాధునిక సాంకేతికత, ఆయుర్వేద వైద్య విధానాల మేలుకలయికతో 'డేటా డ్రివెన్ హెల్త్‌కేర్'ను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఈ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ హను యెడ్లూరి తెలిపారు. బ్రాంచ్ ప్రారంభోత్సవం సందర్భంగా జూలై 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు రోగులకు ఉచిత కన్సల్టేషన్ సేవలు అందించనున్నట్లు డాక్టర్ హను తెలిపారు.

**వ్యాధి మూలాలపై పోరాటం.. రివర్సల్ ప్రోగ్రామ్స్**
ఈ సందర్భంగా డాక్టర్ హను యెడ్లూరి మాట్లాడుతూ, కేవలం రోగ లక్షణాలను అణచివేస్తూ జీవితకాలం మందులు వాడే విధానానికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. వ్యాధిని మూలాల నుంచి నిర్మూలించడమే తమ ప్రధాన ఉద్దేశమన్నారు. జన్యుపరమైన పరీక్షలు,ల్యాబ్ టెస్టింగ్,స్మార్ట్ రింగ్స్



ద్వారా 24 గంటలు రోగి ఆరోగ్య స్థితిని మానిటర్ చేస్తూ ఈ నూతన విధానంలో చికిత్స అందిస్తామన్నారు. ముఖ్యంగా డయాబెటిస్,హార్ట్ బ్లాక్స్ వంటి సమస్యలకు సర్జరీలు అవసరం లేకుండా'రివర్సల్ ప్రోగ్రామ్స్'డిజైన్ చేశామని వివరించారు. డయాబెటిస్ విషయంలో కేవలం హెచ్‌బీఏ1సీ లేదా ఫాస్టింగ్ గ్లూకోజ్ తగ్గించడం కాకుండా,గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్ ద్వారా నెగెటివ్ రిపోర్ట్ తీసుకువచ్చి వ్యాధిని పూర్తిగా వెనక్కి పంపుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కీళ్ల నొప్పులు, ఎముకల సమస్యలు సహా దాదాపు 40కి పైగా ఆరోగ్య సమస్యలను మయూర హాస్పిటల్స్ విజయవంతంగా రివర్స్ చేస్తోందన్నారు.

**సామాన్యులకూ అందుబాటులో 'జెనెటిక్ టెస్టింగ్'**

భవిష్యత్తులో వచ్చే జబ్బులను ముందుగానే పసిగట్టి, వాటి బారిన పడకుండా రక్షించే 'ప్రివెంటివ్ కేర్' కోసం స్వదేశీ పరిజ్ఞానంతో ఒక టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్‌ను నిర్మించినట్లు డాక్టర్ హను తెలిపారు. "కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల విలువ చేసే జెనెటిక్ టెస్టింగ్‌ను మయూర హాస్పిటల్స్‌లో సామాన్యులకు అందుబాటు ధరలోకే తీసుకువచ్చాం. తల్లిదండ్రులు, తాతల నుంచి పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి పొలాలు,ఇళ్లు కాదు..వారి ఆరోగ్యానికి సంబంధించిన 'జెనెటిక్ బ్లూప్రింట్'. ఇది ప్రతి ఒక్కరి ఇళ్లలో, బ్యాంక్ లాకర్లలో దాచుకోవాల్సిన అత్యంత విలువైన సమాచారం" అని ఆయన ఉద్ఘాటించారు. ఈ రిపోర్ట్ ద్వారా ఏ ఆహారం పడుతుంది,ఏ మందులు పనిచేస్తాయో కచ్చితంగా తెలుసుకోవచ్చని సూచించారు. వయసు పైబడినా ప్రతిరోజూ గుప్పెడు మందులు మింగాల్సిన అవసరం లేకుండా, ఆరోగ్యంగా జీవించవచ్చని నిరూపించడమే మయూర హాస్పిటల్స్ ఆకాంక్ష అని ఆయన అన్నారు. మయూర హాస్పిటల్స్ అన్ని బ్రాంచీలలో (మియాపూర్,దిల్ సుఖ్ నగర్,శ్రీనగర్ కాలనీ) ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 7:00 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నంబర్: 89770 30642 లో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ హను యెడ్లూరి కోరారు.

# యూఎస్ఏలో వంగాల బాల్‌రాజ్‌గౌడ్ దంపతులకు ఘన సత్కారం



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):**
యునిటేడ్ స్టేట్ ఆఫ్ అమెరికా దేశంలోని పిల్‌డెల్‌పియా పిల్ ఎక్స్‌పో సెంటర్‌లో "ఆదర్శ కిరణం' మాస పత్రిక,ఆదర్శ్ మ్యాట్రిమోని' సంపాదకులు వంగాల బాల్‌రాజ్ గౌడ్ దంపతులను ఎంఏటీఏ ఫౌండర్ వ్యవస్థాపక అధ్యక్షులు గనగౌని శ్రీనివాస్ ఘనంగా సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వంగాల బాల్‌రాజ్ గౌడ్ ఎన్నో ఏండ్ల నుండి "ఆదర్శ కిరణం' మాస పత్రిక ద్యారా అన్ని వర్గాల వారికి తమ పత్రిక ద్యారా మేలైన సమాచారంతో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని కొనియాడారు. అంతే కాకుండా "ఆదర్శ్ మ్యాట్రిమోని' ఎంతో మందికి సంబందాలను సమకూర్చారని తెలిపారు. వంగాల బాల్‌రాజ్ గౌడ్ చేసిన సెవలను అభినందించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంఏటీఏ ఫౌండర్ వ్యవస్థాపక అధ్యక్షులు గనగౌని శ్రీనివాస్,ట్రెజరర్ గుడాల శ్రీధర్, ఆక్టింగ్ ప్రసిడెంట్ కిరణ్,ఎంఏటీఏ కీ ఆర్గనైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.రవీందర్ నాయక్ కు వైద్య శిరోమణి అవార్డు 2026 ప్రధానం..



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** తల్లిదండ్రులు ప్రాణం పోస్తే, పునర్జన్మ ప్రసాదించేది వైద్యులేనని, మానవాళి మనుగడకు వైద్యుల సేవలు మరువలేనివని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీందర్ నాయక్ అన్నారు. బుధవారం కోటి లోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం (భారతరత్న డాక్టర్ బిసిరాయి జయంతిని) పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. భారతరత్న డాక్టర్ బిసిరాయ్ జీవితాన్ని వైద్యులు స్ఫూర్తిగా తీసుకొని రోగరహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భగవంతుడితో సమానమైనది వైద్యవృత్తి అని, పేద రోగులకు వైద్యులు మానవత దృక్పథంతో నిస్వార్ధంగా సేవలు అందించాలని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ జియోగ్రఫీ డిపార్ట్మెంట్ అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అక్తర్ అలీ మాట్లాడుతూ, పగలు రాత్రి లేకుండా అవిశ్రాంతంగా పనిచేస్తూ సొంత అవసరాలను సైతం త్యాగం చేసి ఎందరో జీవితాలను కాపాడుతున్న వైద్యుల సేవలు మరువలేనివని అన్నారు. లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ డైరెక్టర్ లయన్..ప్రేమ్ చంద్ జైన్ మాట్లాడుతూ, రోగికి వైద్యుడికి ఉన్న సంబంధం ఎంతో గొప్పదన్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీందర్ నాయక్ ను తెలంగాణ రాష్ట్రం నుండి ఒక్కరికి ఇచ్చే వైద్య శిరోమణి అవార్డును తెలంగాణ మేధావులు ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ శాలువా, పూలమాల, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించి అభినందించారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మజ అడిషనల్ డైరెక్టర్, డాక్టర్ శివ బాలాజీ జాయింట్ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్ అడ్మిన్ శశి శ్రీ , జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సూపర్ నా కోఆర్డినేటర్లుకె. రవీందర్,బిచ్చుకారి సూర్య , జి.వేణుగోపాల్, విద్యాసాగర్ లు పాల్గొని డాక్టర్ రవీందర్ నాయక్ వైద్య సేవల గురించి వివరించి అభినందనలతో పాటు శుభాకాంక్షలు తెలిపారు

# నిబంధనలను విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలపై ఎస్ఎఫ్ఐ ధర్నా

**ఇష్టనుసారంగా విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేట్ స్కూల్స్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి - రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్**

**శంషాబాద్,(ప్రజావినికిడి):**
జులై1,శంషాబాద్ జోన్ కేంద్రంలో నారాయణ పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. శంషాబాద్ కేంద్రంలోని సిద్ధాంతి లో ఉన్న నారాయణ స్కూల్ నిబంధనలు ఉల్లంఘిస్తూ పాఠశాలలోనే నోటు బుక్కులు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ పాఠశాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పాఠశాలలతో బయట నుంచి యాజమాన్యానికి ఇచ్చిన పాఠశాల అనుమతి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్ మాట్లాడుతూ,
ఈ పాఠశాలలో బుక్స్ తో పాటు యూనిఫారం, బ్యాడ్జి తదితర విద్యార్థులు వాడే వస్తువులన్నీ అధిక ధరలకు విక్రయిస్తున్నారని రజమెత్తారు. నిబంధన జీవో 91 ప్రకారం ఏ పాఠశాలలో గాని ఎలాంటి బుక్స్ ఇతర వస్తువులు అమ్మ వద్దని చట్టం చెప్తుంది కానీ ఈ కార్పొరేట్ పాఠశాలల యజమాన్యం
ఏమాత్రం నిబంధనలు ఖాతరు చేయకుండా తమ ఇష్టం వచ్చినట్టు బుక్స్ గాని యూనిఫారాలు గాని అమ్మ దాన్ని ఎస్ఎఫ్ఐ శంషాబాద్ మండల శాఖ పాఠశాలలో రెడ్



హ్యాండెడ్ గా పట్టుకొని ఆ బుక్స్ ను ఇతర వస్తువులను మండల విద్యాధికారి కార్యాలయంలో అప్పుచెప్పినట్టు చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రభుత్వ మటుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.
విద్యార్థుల వద్ద అధికంగా ఫీజులు వసూలు చేయాడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రతి పాఠశాలలో 25% శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని ప్రభుత్వం నిబంధనలు విధించిన అసలు ఎవరు పట్టించుకోవడంలేదని ఉచితంగా విద్య అందించడంలో కార్పొరేట్ పాఠశాలలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని గజమెత్తరూ..



ఈ సంఘటనపై మండల విద్యాధికారి వెంటనే తగిన చర్యలు తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ విద్యార్థులు అందరూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి అవసరమైతే జిల్లా కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు శంషాబాద్ జోన్ కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో నడుస్తున్న పాఠశాలలన్నింటినీ మాఎస్ఎఫ్ఐ మండల శాఖ సందర్శించి విద్యార్థులకు పుస్తకాలు గానీ వేరే ఇతర వస్తువులు కానీ విక్రయిస్తే తగిన చర్యలు తీసుకొని విద్యార్థులకు అండగా నిలబడతామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ శంషాబాద్ మండల నాయకులు ప్రసాద్,సాయి, తరుణ్,చందు, వెంకట్,తనిష్క్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి లక్ష్యం మారితేనే గ్రామాలకు మహర్దశ !

**జూలై 1(ప్రజావినికిడి):**
ఉపాధి హామీ పథకం పేరు మారింది. నింబంధనలు మార్చిన కేంద్రం ప్రభుత్వం వీబీజీరామ్‌జీ అంటే వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవిక మిషన్ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తీసుకుని వచ్చింది. పథకం పేరు మారినా పెద్దగా మారిందేమీ ఉండకపోవచ్చు. ఇందులో గతంలో కేంద్రం 90శాతం నిధులు, రాష్ట్రాలు పదిశాతం నిధులు భరించేవి. కానీ ఇప్పుడు కేంద్రం 60శాతం, రాష్ట్రాలు 40శాతం నిధులు భరించేలా మార్పులు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2006లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టుంది. కూలీలకు ఉపాధి కల్పించే పథకంగా పేరు సంతరించుకున్న ఉపాధి హామీ పథకం ఇక వీబీజీరామ్‌జీ పేరుతో జులై1 నుంచి అమలు చేయనున్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను సమకూర్చేవి. వీబీజీరామ్‌జీకి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించనున్నాయి. ఈలెక్కన రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం అదనంగా నిధులు భరించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకం అమలుతో వలసలు తగ్గడంతో పాటు,గ్రామీణప్రాంత ప్రజలకు ఎంతోకొంత ప్రయోజనకరంగా మారింది. వీబీజీరామ్‌జీతో ఉపాధి కూలీలకు మేలు చేకూరనుంది. పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచారు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే, వేలకోట్లు ఖర్చు చేసినా గ్రామాల్లో పెద్దగా మార్పులు కానరాలేదు. ఈ పథకం పేరు మార్చిన పెద్దలు విధానలను పట్టించుకున్నట్లుగా లేదు. గ్రామాల్లో ఇప్పుడు వ్యవసాయ కూలీల కొరవ ఉంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు వెనక్కి పోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువులు కుంటలు మాయం అవుతున్నాయి. పచ్చదనం పగటికలగా మారింది. పర్యావరణ విధ్వంసం యధావిధిగా సాగుతోంది. చెరువుల పునరుద్దరణ సాగాలి. నాలాల పూడికతీతలు చేయాలి. వాననీటి సంరక్షణ పథకాలు చేపట్టాలి. ఈ క్రమంలో వీటన్నింటిని ఇందులో చేర్చి పక్కాగా కొత్త పథకం ద్వారా దేశ నిర్మాణం చేయగల గాలి. అప్పుడే వెచ్చించిన డబ్బులకు ప్రతిఫలం దక్కుతుంది. కేవలం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఏదో ఒక పనిచేయించామన్న రీతిలో పథకం సాగరాదు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు వేతనాలు ఆలస్యమయ్యేవి. ఒక్కోసారి నెలలు గడిచినా డబ్బులు జమయ్యేవి కావు. నూతన పథకంలో వేతనాలు ఆలస్యమైతే కూలీలకు పరిహారం చెల్లించనున్నారు. పనిచేసిన తరువాత 15 రోజుల్లో కూలీల బ్యాంకు ఖాతాల్లో వేతనం జమ చేయనున్నారు. అలస్యమైతే పరిహారం ఇవ్వనున్నారు. గతంలో కాకుండా ప్రతి కుటుంబానికి 125 రోజులు పని దినాలు కల్పించనున్నారు. వీబీజీరామ్‌జీ పథకాన్ని మూడుగా విభజించారు. పనుల్లో పారదర్శకత పెంచడడంతోపాటు అరు నెలలకోసారి సామాజిక తనిఖీలు చేయనున్నారు. వేతనాల చెల్లింపు



వివరాలను బహిరంగంగా వెల్లడించ నున్నారు. ఫిర్యాదుల స్వీకరణకు సరికొత్త వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురానున్నారు. కొత్త పథకంపై తెలంగాణ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇటీవల కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో జరిగిన భేటీలో మంత్రి సీతక్క తమ అభ్యంతరాలను తెలియచేసింది. కేంద్రం కూడా రాష్ట్రాల అభ్యంతరాలతో పాటు, పనుల నిర్వహణపై సూచనలు సలహాలు తీసుకుని ఉంటే బాగుంటుంది. ఎందుకంటే చేపట్టే పనులు గ్రామాల ఆర్థిక పరిస్థితిని మార్చగలిగేలా ఉండాలి. గ్రామాల్లో చెరువుల పూడికతీత, భవనాల నిర్మాణం, కాలువల నిర్మాణం, మొక్కల పెంపకం, కొతుల నిర్మూలన వంటి పనులన్నీ ఇందులోకి తీసుకుని రాగలిగితే మంచిది. ఇకపోతే వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ కొత్త ఉపాధి పథకంలో అయినా ఈ సమస్యకు పరిష్కారం చూపగలగాలి. ఎల్‌నినో ప్రభావంతో ఈ యేడు వర్షాలు అంతంతమాత్రంగానే ఉండనున్నాయి.

ఈసారి అనేక ప్రాంతాల్లో నైరుతి వర్షించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై తీవ్ర ప్రభావం ఉండబోతోంది. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్యమవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో ఉపాధి పనులతో సమస్యలను ఎదుర్కొనేందుకు ఎదురీదాలి. గ్రామాల్లో నీటి వనరులను పెంచే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మొక్కలను పెంచాలి. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనికి విరుగుడుగా ప్రధానంగా భూగర్భ జాలాలను పెంచుకోవాలి. వాననీటిని ఒడిసిపట్టాలి. ఈ పనులకు అవసరమయ్యే కూలీలను ఉపాధి పథకం ద్వారా భర్తీ చేయగలగాలి. అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మార్గం చూపినవారం అవుతాం.

# ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యం

**పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి -వరి బదులు ఆరుతడి పంటలపై సిఎం రేవంత్ సూచనలు**

**హైదరాబాద్,జూలై 1 (ప్రజావినికిడి):** నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజాగా సిఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని, అందువల్ల రైతులు ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలని కోరారు. వరికి అసవరమైన నీరు లభించనప్పుడు, ఆరుతడి పంటలవైపు మళ్లాలలని అన్నారు. దీంతో రైతులు కూడా ఈదిశగా ఆలోచన చేయాల్సి ఉంది. అదేపనిగా వరి పండించడం వల్ల కూడా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఈ అవకాశాన్ని ఆసారగా తీసుకుని మార్పుకోసం ప్రయత్నిస్తే మంచిదే. ఎందుకంటే వర్షాలు పడతాయో లేదో తెలియడం లేదు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో నారు వేసే పరిస్థితి లేదు. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సిఎం ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ




నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంగా కనిపిస్తోంది. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల

నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది.

# రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆగివున్న ట్రక్కును ఢీకొన్న బస్సు**

**మంటలు చెలరేగడంతో ఏడుగురు సజీవ దహనం**




**దౌసా,జూలై 1 (ప్రజావినికిడి)::** రాజస్థాన్‌లో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. దౌసా జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు, నిలిపి ఉంచిన ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే వాహనాల్లో మంటలు చెలరేగడంతో ఘటనా స్థలంలోనే ఏడుగురు ప్రయాణికులు సజీవదహనమయ్యారు. స్థానిక సమాచారం ప్రకారం.. బస్సు వేగంగా వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న ట్రక్కును వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు క్షణాల వ్యవధిలోనే బస్సులో భారీగా మంటలు వ్యాపించాయి. ప్రయాణికులు నిద్రమత్తులో ఉండటంతో ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే మంటలు బస్సు మొత్తాన్ని చుట్టుముట్టాయి. ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. 22 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ్గ÷ర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి అతివేగమే కారణమా లేక డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్ల జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల కలకలం

**పోలీసులపై మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ దాడి**

**ఆత్మరక్షణ కోసం పోలీసుల కాల్పులు**



**హైదరాబాద్,జూలై 1(ప్రజావినికిడి):**
హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున కాల్పులు కలకలం సృష్టించాయి. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నారనే సమాచారంతో అతన్ని పట్టుకునేందుకు నల్లగొండ సీసీఎస్ పోలీసుల బృందం అక్కడకు వెళ్లింది. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ సమీపంలోని బొంగులూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 వద్ద శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా.. పోలీసులపై తిరగబడి కత్తితో దాడి చేశారు. ఈ క్రమంలో పోలీసులు ఆత్మరక్షణ కోసం అతనిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నల్లగొండ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి తలకు గాయమైనట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు చెందిన భూష్మి శ్రీకాంత్ చిన్న చిన్న దొంగతనాలు చేస్తుండేవాడు. 2007లో అతడిని అరెస్టు చేసే క్రమంలో కానిస్టేబుల్ వేణుబాబును చంపి పారిపోయాడు. అప్పటి నుంచి 120కిపైగా పైగా నేరాలు చేశాడు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే అతనిపై సుమారు 300 వరకు కేసులు ఉన్నాయి. దీంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శ్రీకాంత్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భూష్మి శ్రీకాంత్ హైదరాబాద్‌లో ఉన్నాడనే సమాచారం తెలియడంతో సీసీఎస్ పోలీసుల బృందం వెళ్లింది. బొంగులూరు ఎగ్జిట్ వద్ద శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో తప్పించుకునేందుకు శ్రీకాంత్ కత్తితో పోలీసులపై దాడికి దిగాడు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. తర్వాత నిందితుడి కాళ్లపై కాల్చారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ తలకు గాయమైంది. దీంతో హెడ్ కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించారు. నిందితుడి తలకు గాయం కావడంతో హైదరాబాద్ వనస్థలిపురంలోని ఆస్పత్రికి తరలించారు.

# ఆప్యాయంగా పలకరింస్తూ పెన్షన్లు అందచేత


**పేదలకు పెన్షన్ల పంపిణీ చేసిన హోంమంత్రి అనిత**



**అనకాపల్లి,జూలై1(ప్రజావినికిడి):** రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కొనసాగుతోంది. ఆయా నియోజకవర్గాల్లో లబ్దిదారులకు మంత్రులు, అధికారులు పెన్షన్లను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో పాత పెద్దిరెడ్డి వారి వీధిలో హోం మంత్రి అనిత పెన్షన్లను పంపిణీ చేశారు. వర్షంలో కూడా ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను లబ్దిదారులకు అందజేశారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాయకరావుపేట వార్డుల్లో పర్యటించిన అనిత.. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.మామిడిపండ్లు అమ్మే పైడమ్మతో హోం మంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. ఆపై ఆమె వద్ద పండ్లను కొనుగోలు చేశారు. పాయకరావుపేటలో రోడ్డుపక్కన టిఫిన్ షాపు నిర్వాహకురాలిని పలకరించారు. అక్కడే స్థానిక నాయకులతో కలిసి అనిత గారెలు తిన్నారు. అనంతరం పాయకరావుపేట ఖఊఅలో నూతన భవనాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు.

# గాదె సాయి కృష్ణ కస్టడీ డెత్ కేసు..

**మరో ఇద్దరు కానిస్టేబుళ్లు అరెస్ట్**



**జూలై 1(ప్రజావినికిడి):**
విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయి కృష్ణ (25) కస్టడీ మృతి కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో తాజాగా మరో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లను అరెస్ట్ చేసింది. దీంతో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య ఐదుకు చేరింది.

కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుళ్లు బాబూరావు, సాంబయ్యలను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేసులో ఐదో నిందితుడిగా బాబూరావు, ఆరో నిందితుడిగా సాంబయ్య ఉన్నారు. వారిని రెండో ఏసీఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. బాబూరావును అవనిగడ్డ జైలుకు, సాంబయ్యను గన్నవరం జైలుకు తరలించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ) ఎస్.ఎస్.వి.వి. నాగరాజుకు వీరిద్దరూ సహకరించారని ఆరోపణలు ఉన్నాయి.మే 6వ తేదీన పోలీసులు అదుపులోకి తీసుకున్న సాయి కృష్ణ అదృశ్యమయ్యాడు. లాకప్‌లో చిత్రహింసలకు గురిచేసి, కొట్టి చంపేశారని, ఆ తర్వాత మృతదేహాన్ని ఎలక్ట్రిక్ శ్మశానవాటికలో దహనం చేసి ఆధారాలు మాయం చేశారని అతని కుటుంబం ఆరోపిస్తోంది. సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు జూన్ 19న భారతీయ న్యాయ సంహిత కింద పోలీసులు కేసు నమోదు చేశారు.కస్టడీలో తీవ్ర గాయాల వల్లే సాయి కృష్ణ మరణించాడని సిట్ ఇప్పటికే కోర్టుకు నివేదించింది. అంతేకాకుండా పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని ఉద్దేశపూర్వకంగా తొలగించారని కూడా దర్యాప్తులో తేలింది. కొన్ని కేసులు, నాన్-బెయిలబుల్ వారెంట్లు ఉన్న సాయి కృష్ణను మార్కాపురంలో అదుపులోకి తీసుకుని, కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించినట్లు సిట్ పేర్కొంది.ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఇన్‌స్పెక్టర్ నాగరాజును సిట్ జూన్ 23న అరెస్ట్ చేయగా, కోర్టు అతనికి జులై 8 వరకు రిమాండ్ విధించింది. మరో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నాని ఇప్పటికే పోలీసులకు లొంగిపోగా, వారిని కూడా ప్రభుత్వం సస్పెండ్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఐజీ ఎం. రవిప్రకాశ్ నేతృత్వంలోని సిట్ బృందం కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యుల కీలక పాత్ర

## నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి -డాక్టర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర

**హైదరాబాద్,జూలై 1(ప్రజావినికిడి):**
డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. తమ నైపుణ్యం ద్వారా ప్రతి రోజూ వేల ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, తగిన మానవ వనరులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లతో పాటు ఇతర పోస్టులను కూడా పెద్ద సంఖ్యలో భర్తీ చేశామని చెప్పారు. సుమారు 15 వేల పోస్టులు భర్తీ చేశామని తెలిపారు.



ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేర్చుతూ 48 డెంటల్ సర్జన్ పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. డాక్టర్ల దశాబ్దకాల ఆకాంక్ష అయిన ఉస్మానియా నయా హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించామని, అలాగే గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో నూతన హాస్టళ్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని మంత్రి తెలిపారు. వైద్యులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందికి మెరుగైన వర్క్ ఎన్విరాన్‌మెంట్ కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని మంత్రి గుర్తు చేశారు. అ÷-దదె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ వైద్యుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా వైద్యులు తమ సేవలను కొనసాగించాలని
కోరుతూ, డాక్టర్స్ డే సందర్భంగా మరోసారి రాష్ట్రంలోని వైద్యులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

-----------------

# డీసీపీ శిరీషను మర్యాదపూర్వకంగా కలిసిన రిపోర్టర్ శ్వేత యాదవ్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం ప్రజా వినికిడి రిపోర్టర్ శ్వేత యాదవ్ బుధవారం షాద్‌నగర్ డివిజన్ డీసీపీ శిరీషను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీ శిరీషకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు మహిళల భద్రత, ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు చేపడుతున్న కార్యక్రమాలను శ్వేత యాదవ్ అభినందించారు. ప్రజలకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలు మరింత సమర్థవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీసీపీ శిరీష మాట్లాడుతూ, ప్రజలు పోలీసు శాఖతో సమన్వయంగా ఉండి చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రస్తుత సమాజం లో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ సందర్బంగా షాద్ నగర్ నియోజకవర్గం లో మహిళా జర్నలిస్ట్ రావడం సంతోషకర విషయం అని సమాజం లో మీడియా పాత్ర కీలకమని వాస్తవాలు రాయాలని ఈ సందర్బంగా జర్నలిస్ట్ శ్వేతా యాదవ్ కు దిశ నిర్దేశం చేసి అభినందనలు తెలియజేశారు.



# వీబీ-జీ-రామ్-జీ పథకానికి నేడు శ్రీకారం

## తిరుపతి జిల్లాలో ప్రారంభించనున్న మంత్రులు -ముఖ్య అతిథులుగా సిఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాక

**తిరుపతి,జూలై 1(ప్రజావినికిడి):** రాష్ట్రంలో మాత్రం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జూలై 2వ తేదీన పథకాన్ని తిరుపతిలో ప్రారంభించనున్నారు. అదేరోజు జిల్లాలో కొత్త పథకం అమలులోకి రానుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం.. బుధవారం నుంచి 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, అజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ-జీ-రామ్-జీ)'గా మారింది. వలసలకు అడ్డుకట్ట వేస్తూ 2006లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణులకు పనులు కల్పిస్తూ తీసుకొచ్చిన ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ మంగళవారంతో ముగిసింది. బుధవారం నుంచి వీబీ-జీ-రామ్-జీ అమల్లోకి వస్తున్నా.. గురువారం తిరుపతి జిల్లాలోని ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె పంచాయతీ మంగంపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, కమలేష్ పశ్వాన్, పెమ్మసాని చంద్రశేఖర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాగా, ప్రతి మండలం



లోనూ ఒక పంచాయతీలో.. వీబీ-జీ-రామ్-జీ పథకాన్ని బుధవారం నుంచి అమలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)ద్వారా కొత్త పథకాన్ని కొనసాగించనున్నారు. ఇందుకోసం డ్వామా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కాగా, ఇప్పటి వరకు కూలీలకు తప్పనిసరిగా వంద రోజుల ఉపాధి పనులు కల్పిస్తున్నారు.
వీబీ-జీ-రామ్-జీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉండి ఉపాధి పనులకు వచ్చే ప్రతి కుటుంబానికి ఏటా 125 పనిదినాలు కల్పిస్తారు. రెండు వారాలకు ఒకసారి ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లిస్తారు. ఒకవేళ చెల్లింపుల్లో జాప్యం జరిగితే, ప్రత్యేక పరిహారం చెల్లిస్తారు. ఆరు నెలలకు ఒక సారి సామాజిక తనిఖీలు నిర్వహిస్తారు. క్షేత్ర స్థాయిలోని లోపాలు ఎప్పటికప్పుడు సవరించడానికి కూలీల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, త్వరతగతిన పరిష్కారం చేపట్టనున్నారు. పశువుల కొట్టాలు, కంపోస్టు పిట్స్, అమృత్/మినీ అమృత్ సరోవర్లు, పశువులకు చెరువులు, పూడికతీత, పునరుద్ధరణ, చెక్‌డ్యాంల పూడికతీత, ఫీడర్లు, ఫీల్డ్ ఛానెళ్లు, తవ్విన చెరువులు, చేపల చెరువులు, పశు మేత అభివృద్ధి, ఇంకుడు కుంటలు, మేజిక్ కాలువలు, రీ బుష్ ఎ÷-లాంటేషన్, కొత్త చెక్ డ్యాంలు, ఎ÷-లాంటేషన్, నర్సరీలు, సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, బీటీ రోడ్లు, ట్రెంచ్‌లు తదితర పనులు చేపట్టనున్నారు. ఈ పనులను చూస్తుంటే.. రైతులకు పాక్షికంగా మేలు చేసేలా ఉంది. నూతన సంస్కరణలతో వ్యవసాయరంగానికి, రైతాంగానికి పూర్తిగా ప్రయోజనం చేకూరనుంది.

# రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉంది

## తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్,జూలై 1(ప్రజావినికిడి):**
రాష్ట్ర అజెండా మారాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే మళ్లీ అధికారంలోకి వస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలలు కంటున్నారని ఆమె విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవని చెబుతూ, మరోవైపు మూసీ ప్రాజెక్టుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా పేద ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు రాలేదని కవిత అన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే సంకల్పంతోనే తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదలపై ఆర్థిక భారం లేకుండా ఉచిత విద్య, ఉచిత వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అజెండా మారుస్తానన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని హార్డ్ వర్క్‌నే నమ్ముకోవాలని కవిత సూచించారు.

-----

# రేవంత్ రెడ్డికి రైతులు బుద్ధి చెప్పడం ఖాయం

## బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**నిజామాబాద్,జూలై 1(ప్రజావినికిడి):** రైతులను అడుగడుగునా ద్రోహం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు ఆశీర్వాద సభ అంటూ నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే లక్ష్యంగా తన ప్రసంగాన్ని కొనసాగించారని ఆరోపించారు. ప్రజాధనంతో సభలు ఏర్పాటు చేసి ఆశీర్వాద సభను శాపనార్థాల సభగా మార్చారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నాడని రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. మోసంచేసే పార్టీని ఏ విధంగా రైతులు ఆశీర్వాదిస్తారని పేర్కొన్నారు. 2018 లో కొడంగల్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న రేవంత్ రెడ్డి మూడు నెలల్లో ఎంపీ ఎలక్షన్లో నిలబడటం సిగ్గుచేటన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగని విమర్శించారు. కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మూడు లక్షల పెళ్లిళు అయ్యాయని గుర్తు చేశారు. లబ్దిదారులకు వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు.

------

# మణికొండలో ఈగిల్ టీమ్ దాడులు

## హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న వక్తి పట్టివేత

**హైదరాబాద్,(ప్రజావినికిడి):** హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మణికొండలో 'ఈగల్ టీమ్' బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో భాగంగా ఓ ప్రైవేట్ హోటల్‌లో బస చేసిన వ్యక్తిని హ్యష్ ఆయిల్ విక్రయిస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు మణికొండ పరిధిలోని సదరు ప్రైవేట్ హోటల్‌పై ఈగల్ టీమ్ సభ్యులు ఒక్కసారిగా మెరుపు దాడులు చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. నిందితుడి నుంచి 9 గ్రాముల లీక్విడ్ హ్యాష్ ఆయిల్‌ను అధికారులు స్వాధీనం



చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితుడితో పాటు సీజ్ చేసిన హ్యాష్ ఆయిల్‌ను స్థానిక నార్సింగి పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ వ్యక్తి డ్రగ్స్ విక్రేతా? లేక ఏజెంటా? అనే కోణంలో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హ్యాష్ ఆయిల్ ఎక్కడి నుంచి నగరానికి తీసుకొచ్చారు? దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరు ఐటీ కారిడార్‌లోని ఎవరెవరికి దీనిని సరఫరా చేస్తున్నారనే అంశాలపై నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు. నగరంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిఘా మరింత కఠినతరం చేసినట్లు అధికారులు తెలిపారు.

# మహారాష్ట్రలో బాబ్లీ గేట్లు ఎత్తివేత

**నిజామాబాద్,జూలై 1(ప్రజావినికిడి):** మహారాష్ట్రలోని ఎగువ గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ గేట్లను సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి), మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ అధికారుల సమక్షంలో 14 గేట్లను ఎత్తివేశారు. బాబ్లీ ప్రాజెక్టులో నీటి నిల్వ స్వల్పంగా ఉండడంతో తెలంగాణ ప్రాంతానికి కేవలం 0.20 టిఎంసిల వరద మాత్రమే వచ్చింది. ఈ దశాబ్ద కాలంలో ఎగువ గోదావరి నుంచి ఇంత తక్కువ మొత్తంలో వరద రావడం ఇదే తొలిసారి అని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఎత్తిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు అక్టోబర్ 28వ తారీఖు వరకు తెరిచి ఉంటాయి. అంతర్ రాష్ట్ర జలవివాదాలు నేపథ్యంలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలంలో, ఎండాకాలంలో బాబ్లి గేట్లను ఎత్తి దిగువకు వరద వదిలిపెడుతున్నారు.

# వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌కు బ్రేక్

## మెటాకు కేంద్రం నోటీసులు..వివరాలు ఇవ్వాలని ఆదేశం

**న్యూఢిల్లీ,జూలై 1(ప్రజావినికిడి):** వాట్సప్‌లోని యూజర్‌నేమ్ ఫీచర్ విషయంలో మెటాకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని సూచించింది. అప్పటి వరకు భారత పౌరులకు యూజర్‌నేమ్ ఫీచర్ రోల్‌అవుట్‌ను ఆపాలని పేర్కొంది. ఈ వ్యవహారంలో సంప్రదింపులు పూర్తయ్యాకనే ఈ అంశంపై ముందుకెళ్లాలని నోటీసుల్లో పేర్కొంది. యూజర్‌నేమ్ విషయంలో సైబర్ నిపుణుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రముఖుల పేర్లతో మోసాలకు పాల్పడే అవకాశం ఉందని, దుర్వినియోగానికి ఈ ఫీచర్ వీలు కల్పిస్తోందన్న ఆందోళనల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. ఫోన్ నంబర్ ప్రైవసీని కాపాడుతూ యూజర్ నేమ్ ఆప్షన్‌ను వాట్సప్ తీసుకొస్తోంది. దీనివల్ల యూజర్లు ఫోన్ నంబరును షేర్ చేయాల్సిన అవసరం ఉండదు. కేవలం యూజర్ నేమ్‌ద్వారా సంభాషణలను జరపవచ్చు. ప్రస్తుతం యూజర్ నేమ్‌ను రిజర్వు చేసుకునేందుకు వాట్సప్ అనుమతిస్తోంది. యూజర్ నేమ్‌లో 3 నుంచి 35 క్యారక్టర్లను అనుమతిస్తారు. అందులో సెలబ్రిటీలు, అత్యున్నత స్థాయి వ్యక్తుల పేర్లను అనుమతించబోరు. యూజర్ నేమ్‌వల్ల ఫోన్ నంబరు కనిపించదని, పెద్ద గ్రూపుల్లో మీరు యాడ్ అయినప్పుడు మీ ప్రైవసీకి రక్షణ లభిస్తుందనేది వాట్సప్ వాదన. ఫోన్ నంబర్‌ను షేర్ చేయకుండా చాట్ చేయడానికి వాట్సప్ తీసుకొచ్చిన




యూజర్ నేమ్ సదుపాయంపై సైబర్ నిపుణులు ఆందోళనలు వ్యక్తంచేస్తున్నారు. సుపరిచిత వ్యక్తుల పేర్లతో నకిలీ యూజర్‌నేమ్స్ సృష్టించి, ప్రజలను మోసం చేసేందుకు ఈ ఫీచర్ అవకాశం కల్పిస్తోందని హెచ్చరిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏదో ఒక యూజర్‌నేమ్‌ను అంచనా వేసి నేరుగా మెసేజ్ చేసే అవకాశం ఉండటంతో స్పామ్ కాల్స్, సందేశాలు పెరిగే అవకాశం ఉందని సైబర్ నిపుణుల వాదన. ఫోన్ నంబర్లు గోప్యంగా ఉంచడం వరకు బాగున్నా.. మోసాలను అరికట్టడానికి తగిన భద్రతా చర్యలు లేకపోతే టెలిగ్రాం తరహా మోసాలకు వాట్సప్ వేదికగా మారుతుందన్న ఆందోళనలూ నెలకొన్నాయి. ఈ ఫీచర్‌పై పూర్తి వివరాలు ఇచ్చేందుకు మెటాకు కేంద్రం మూడు రోజుల గడువు ఇచ్చినట్టు కూడా తెలుస్తోంది. భారత్ లాంటి దేశంలో ఈ ఫీచర్ కొత్త చిక్కులు తేవొచ్చన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇది అనేక మోసాలకు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రైతులను బెదిరించి డబ్బులు వసూలు

## ఫిర్యాదుతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరెస్ట్

**ఆదిలాబాద్,జూలై 1(ప్రజావినికిడి):** జిల్లాలోని తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కృష్ణ నాయక్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తలమడుగు ఎస్‌హెచ్‌ఓ డి. రాధిక తెలిపారు. ఆమె తెలిపినవివరాల ప్రకారం కజ్జర్ల-దేవాపూర్ గ్రామాల మధ్య రహదారి ఇరువైపులా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్‌కు రైతులు తమ పొలాల్లోని పంట అవశేషాలను తగులబెట్టిన సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి కొంత నష్టం వాటిల్లిందని వివరించారు. దీనిని ఆసరాగా చేసుకున్న నిందితుడు కృష్ణ నాయక్, రైతులను బెదిరిస్తూ మొక్కలకు జరిగిన నష్టానికి పరిహారంగా రూ. 1,50,000 ఇవ్వాలని రైతులను డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని బెదిరించాడని పేర్కొన్నారు. బెదిరింపులకు భయపడి చింతలపెల్లి జైభరత్ రెడ్డి రూ. 25 వేలు, యెల్మ రఘువరన్ రెడ్డి రూ. 10వేలు, తాండ్ర మహేష్ రూ. 7,500, తాండ్ర నర్సింహులు రూ. 7,500 చొప్పున మొత్తం రూ. 50వేలు, నిందితుడికి ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కృష్ణ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు రాధిక తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి హోదాను దుర్వినియోగం చేసి ప్రజలను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# తిలక్ వర్మ వల్లే ఇండియా ఘోర ఓటమి

**● మాజీ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్**



ఐర్లాండ్ చేతిలో టీమిండియా 0-2 తో టీ20 సిరీస్ ఓడిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బెల్ఫాస్ట్‌లో జరిగిన సెండ్ టీ20 మ్యాచ్ లో కేవలం ఒక్క రన్ తేడాతో ఇండియా ఓడిపోగా 155 రన్స్ టార్గెట్ ను ఛేజ్ చేయడంలో టీమ్ ఫెయిల్ అయింది. ఈ మ్యాచ్ లో ఇండియా తరపున హైయెస్ట్ స్కోరర్‌గా నిలిచి హాఫ్ సెంచరీ చేసిన వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ప్రెజెంట్ తీవ్ర విమర్శలు ఫేస్ చేస్తున్నాడు. మాజీ ఓపెనర్, మాజీ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్‌లో తిలక్ వర్మపై ఘాటు వ్యాఖ్యలు చేశాడు. తిలక్ టీమ్ విజయం కంటే తన పర్సనల్ గ్లోరీ కే ఎక్కువ ప్రయారిటీ ఇచ్చాడని శ్రీకాంత్ ఓపెన్ గా విమర్శించాడు.ఈ మ్యాచ్ లో తిలక్ వర్మ 46 బంతుల్లో 55 రన్స్ చేశాడు. టీమ్ లో ఎక్కువ సేపు క్రీజులో ఉన్నప్పటికీ రిక్వైర్డ్ రన్ రేట్ కు తగ్గట్లుగా అతను ఇన్నింగ్స్ ను యాక్సిలరేట్ చేయలేకపోయాడు. తిలక్‌తో పాటు మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు శివం దూబే (16 బంతుల్లో 20 రన్స్), అక్షర్ పటేల్ (18 బంతుల్లో 14 రన్స్) ల స్లో బ్యాటింగ్ ను కూడా శ్రీకాంత్ తీవ్రంగా తప్పుపట్టాడు. మిడిల్ ఫేజ్ లో ఇండియా ఆడిన తీరు అస్సలు బాలేదని, అందరి స్ట్రైక్ రేట్లు చాలా పూర్ గా ఉన్నాయని చెప్పాడు. మిడిల్ ఓవర్లలో కాస్త సెటిల్ అయ్యాక అటాకింగ్ స్టార్ట్ చేయాలని, లేదంటే ఇలాగే మ్యాచ్ లు చేజారిపోతాయని శ్రీకాంత్ పేర్కొన్నాడు. తిలక్ వర్మ చేసిన తప్పులను శ్రీకాంత్ పర్టిక్యులర్ గా పాయింట్ అవుట్ చేశాడు. "తిలక్ వర్మ కేవలం తన కోసమే ఆడుకున్నట్లు కనిపించింది. సింగిల్స్, డబుల్స్ తీస్తూ మ్యాచ్ ను లాస్ట్ ఓవర్ వరకు లాగాలని చూశాడు. మ్యాచ్ ను చివర్లో గెలిపించి జెర్సీని పైకి లేపి సెలెబ్రేట్ చేసుకుంటూ హీరో అయిపోదామని అనుకున్నాడు. ఇలాంటి చిన్న టార్గెట్లను ఒక ఓవర్ ముందే ఛేజ్ చేసి ముగించాలి కానీ లాస్ట్ బాల్ వరకు తెచ్చి ప్రెజర్ పెంచకూడదు" అని శ్రీకాంత్ ఫైర్ అయ్యాడు. తిలక్ ఆటిట్యూడ్ టీమ్‌ను దెబ్బతీసిందని అతను చాలా గట్టిగా చెప్పాడు. తిలక్ వర్మ, అక్షర్, దూబే అవుట్ అయిన తర్వాత బౌలింగ్ ఆల్‌రౌండర్ హర్షిత్ రాణా కేవలం 10 బంతుల్లోనే 21 రన్స్ తో మెరుపు క్యామియో ఆడి ఇండియాను విక్టరీకి చాలా క్లోజ్ గా తెచ్చాడు. లాస్ట్ రెండు బాల్స్ లో ఇండియా గెలవడానికి 7 రన్స్ కావాల్సిన టైమ్‌లో హర్షిత్ సిక్స్ కొట్టే ట్రై లో అవుట్ అయ్యాడు. దీంతో ఇండియా ఒక్క రన్ దూరంలో నిలిచిపోయి సిరీస్‌ను కోల్పోయింది. మిడిల్ ఆర్డర్ లో ప్లేయర్లు ప్లాన్ మార్చుకోకపోతే ఫ్యూచర్ లో ఇంగ్లాండ్ టూర్ లోనూ ఇండియాకు కష్టాలు తప్పవని ఈ మాజీ క్రికెటర్ స్పష్టం చేశాడు.

# తొలి టీ20 మ్యాచ్ రద్దు



ఐర్లాండ్ పర్యటనలో ఎదురైన ఘోర పరాజయాన్ని మర్చిపోయి శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు బుధవారం నుంచి ఇంగ్లాండ్ జట్టుతో ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌లో సరికొత్తగా బరిలోకి దిగనుంది. చెస్టర్-లీ-స్ట్రీట్ వేదికగా జరగనున్న ఈ మొదటి పోరులో విజయం సాధించి ఘనంగా ప్రారంభించాలని టీమిండియా భావిస్తోంది. ఐర్లాండ్ పర్యటనలో పరాజయం తర్వాత జట్టు ప్రదర్శన, ఎంపికపై వరుసగా విమర్శలు వస్తున్న నేపథ్యంలో కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై తొలి విజయాన్ని నమోదు చేయాలనే ఒత్తిడి భారీగా ఉంది. ఇంగ్లాండ్ జట్టుపై బలమైన ఆరంభం లభిస్తే జట్టుపై ఒత్తిడి తగ్గడమే కాకుండా ఆటగాళ్లలో కోల్పోయిన ఆత్మవిశ్వాసం కూడా తిరిగి వస్తుంది. కానీ ఈ మ్యాచ్‌కు వాతావరణం రూపంలో ఓ పెద్ద ఆటంకం ఎదురయ్యేలా కనిపిస్తోంది.ఐర్లాండ్ పర్యటన తరహాలోనే ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌కు కూడా వాతావరణం విలన్‌గా మారే అవకాశం ఉంది. చెస్టర్-లీ-స్ట్రీట్‌లో మ్యాట్ జరిగే సమయంలో వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం.. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుందని.. గరిష్ట ఉష్ణోగ్రత 21 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా మ్యాచ్ జరిగే సమయంలో వర్షం పడటానికి 35 శాతం వరకు ఆస్కారం ఉంది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత 3 గంటల వరకు అక్కడ విడతల వారీగా వర్షపు జల్లులు కురిసే అవకాశం ఉంది.



## టీమిండియా ప్లేయర్ల ఫిట్‌నెస్ పై

# గవాస్కర్ అనుమానం


ఉమెన్స్ టి20 వరల్డ్ కప్ 2026 లో ఇండియా జర్నీ ఆస్ట్రేలియా చేతిలో ఓటమితో ముగిసింది. లాస్ట్ గ్రూప్ మ్యాచ్ లో కచ్చితంగా గెలవాల్సిన డూ-ఆర్-డై సిట్యుయేషన్ లో బరిలోకి దిగిన ఇండియా, ఆస్ట్రేలియా ఉమెన్స్ టీమ్ చేతిలో ఓడిపోయి సెమీఫైనల్ రేస్ నుంచి అవుట్ అయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతూ మెరుపు హాఫ్ సెంచరీ చేయగా, ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ సాలిడ్ స్టార్ట్ ఇచ్చారు. దీంతో ఇండియా 170/4 భారీ స్కోర్ చేసింది. 171 రన్స్ టార్గెట్ ఛేజింగ్‌లో ఆస్ట్రేలియా క్లాసిక్ బ్యాటింగ్ చూపించింది. ఫస్ట్ 10 ఓవర్లలో ఇండియా ఆసీస్ ను 72/3 కి కంట్రోల్ చేసినా, ఆ తర్వాత ఎల్లీస్ పెర్రీ, యాష్లే గార్డనర్ ల మధ్య వచ్చిన 100 రన్స్ పార్ట్‌నర్‌షిప్ మ్యాచ్ ను ఇండియా నుంచి లాగేసుకుంది. ఇండియా మెన్స్ టీమ్ ఐర్లాండ్ చేతిలో ఓడిన రోజే ఉమెన్స్ టీమ్ కూడా ఓడిపోవడం ఫ్యాన్స్ ను బాగా అప్‌సెట్ చేసింది. ఈ ఓటమిపై ఇండియన్ క్రికెట్ లెజెండ్ సునీల్ గవాస్కర్ చాలా ఘాటుగా స్పందించాడు. ఆస్ట్రేలియా చేతిలో ఇండియా ఓడిపోవడం తనకు పెద్ద సర్ప్రైజ్ ఏమీ అనిపించలేదని చెప్పాడు. నిజానికి సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్ లోనే ఇండియా టోర్నీ నుంచి వర్చువల్ గా అవుట్ అయిందని గవాస్కర్ విశ్లేషించాడు. "సౌతాఫ్రికాపై ఇండియా కచ్చితంగా గెలవాల్సింది. కానీ ఆ మ్యాచ్ లో మన వాళ్లు చేసిన వరస్ట్ ఫీల్డింగ్ వల్లే చేతిలో ఉన్న మ్యాచ్ పోయింది.

# ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లిన హైదరాబాద్!

**వరంగల్‌ను చిత్తుగా ఓడించిన హైదరాబాద్**



టీజీ 20 లీగ్‌లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. లీగ్‌లో ఏ జట్టుకూ సాధ్యం కాని రీతిలో వరుసగా ఐదో విజయం నమోదు చేసింది. తాజాగా వరంగల్ వారియర్స్‌పై ఆల్‌రౌండ్ ప్రదర్శతో అదరగొడుతూ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. 174 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ నాలుగు వికెట్లు కోల్పోయి 15.3 ఓవర్లలోనే అందుకుంది. కెప్టెన్ అభిరథ్ రెడ్డి (101 పరుగులు, 43 బంతుల్లో) సెంచరీతో అదరగొట్టాడు. గణేశ్ (50 పరుగులు) రాణించాడు. వరంగల్ బౌలర్లలో సల్మాన్, క్రాంతి, కులకర్ణి తలో 1 వికెట్ దక్కించుకున్నారు. టార్గెట్ పెద్దదేమీ కాకపోయినా, హైదరాబాద్‌కు మూడో ఓవర్లో షాక్ తగిలింది. సాయి వికాస్ (10), అజయ్ గౌడ్ (0) రెండు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాతి ఓవర్లోనే అన్విత్ (4) కూడా పెవిలియన్‌కు చేరాడు. దీంతో హైదరాబాద్ 42కే 3 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో హైదరాబాద్‌ను కెప్టెన్ అభిరథ్ రెడ్డి, గణేశ్ ఆదుకున్నారు. తొలుత క్రీజులో సెట్ అయ్యేందుకు ప్రయత్నించారు. ఆ తర్వాత నెమ్మదిగా గేరు మార్చారు. చెత్త బంతులకు బౌండరీలకు పంపిస్తూ మంచి భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ క్రమంలోనే తొలుత గణేశ్ హాఫ్ సెంచరీ చేశాడు. 30 బంతుల్లోనే గణేశ్ ఈ మార్క్ అందుకున్నాడు. అయితే ఆ తర్వాత బంతికే 11.3 వద్ద గణేశ్ పెవిలియన్‌కు చేరాడు. ఈ ఇద్దరు నాలుగో వికెట్‌కు 49 బంతుల్లో 77 పరుగులు పార్ట్‌నర్‌షిప్ చేశారు. ఇది హైదరాబాద్ విజయానికి కీలకంగా మారింది. ఆ తర్వాత వచ్చిన ప్రణవ్ వర్మతో అభిరథ్ రెడ్డి స్కోర్‌ను ముందుకు నడిపించాడు. అతడు 29 బంతుల్లో అర్ధ శతరం నమోదు చేశాడు. ఆ తర్వాత వేగం పెంచేశాడు. దీంకో లక్ష్యం కరిగిపోయింది. ఐదో వికెట్‌కు ప్రణవ్‌తో కలిపి అభిరథ్ 24 బంతుల్లోనే 59 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ క్రమంలోనే ఈ టోర్నీలో తొలి శతకం కూడా అందుకున్నాడు. 16వ ఓవర్లో ఫోర్, సిక్స్‌తో సెంచరీ పూర్తవ్వడమే కాకుండా, మ్యాచ్‌ను కూడా ముగించాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన వరంగల్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. కెప్టెన్ అమన్ రావు పేరాల (45 పరుగులు), రిషికేత్ (38 పరుగులు) ఆకట్టుకున్నారు. చివర్లో కులకర్ణి 7 బంతుల్లో 24 పరుగులు చేశాడు. మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. హైదరాబాద్ బౌలర్లలో అజయ్ గౌడ్ మూడు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. దేవ్ మెహ్‌తా, అఖిల్, అశ్విన్, ప్రణవ్ వర్మ, అభిరత్ రెడ్డి తలో 1 వికెట్ పడగొట్టారు. తాజా విజయంతో హైదరాబాద్ టీజీ20 ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన తొలి జట్టుగానూ ఘనత సాధించింది! అయితే అధికారికంగా కన్ఫర్మ్ కావాల్సి ఉంది. గ్రూప్ దశలో హైదరాబాద్ మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ ఛాంపియన్స్ తమ తదుపరి మ్యాచ్ కరీంనగర్ డైమండ్స్‌తో జులై 04న, అనురాగ్ నల్గొండ నైట్స్‌తో జులై 06న ఆడనుంది.



## మైండ్ గేమ్ మొదలుపెట్టిన

# ఇంగ్లాండ్

భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు సర్వం సిద్ధమైంది. బుధవారం చెస్టర్ లీ స్ట్రీట్ వేదికగా తొలి టీ20 జరగనుంది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్.. మ్యాచ్‌కు ఒకరోజు ముందే తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను ప్రకటించి షాక్ ఇచ్చాడు. ఐర్లాండ్ చేతిలో ఊహించని సిరీస్ ఓటమిని చవిచూసిన టీమిండియా.. బలమైన ఇంగ్లాండ్‌ను వారి సొంతగడ్డపై ఎలా ఎదుర్కొంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇంగ్లాండ్ ఇటీవల న్యూజిలాండ్ చేతిలో టెస్ట్ సిరీస్‌లో ఓడిపోయింది.భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ బుధవారం ప్రారంభం కానుంది. చెస్టర్ లీ స్ట్రీట్ వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే భారత జట్టు.. ఇంగ్లాండ్‌కు చేరుకుని ప్రాక్టీస్ కూడా ప్రారంభించింది. ఇక ఇటీవలే న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో ఓడిపోయిన ఇంగ్లాండ్.. స్వల్ప వ్యవధిలో భారత్‌తో సిరీస్‌కు సిద్ధమైంది. అయితే టెస్ట్ మ్యాచ్‌కు ఒకరోజు ముందు తుది జట్టు ప్రకటించే అలవాటు ఉన్న ఇంగ్లాండ్.. టీ20 మ్యాచ్‌కు ముందు సైతం అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. టీమిండియాతో జరిగే తొలి టీ20 మ్యాచ్ కోసం ఒకరోజు ముందే ప్లేయింగ్ లెవెన్‌ను ప్రకటించింది. హ్యారీ బ్రూక్ సారథ్యంలో ఇంగ్లీష్ జట్టు ఈ సిరీస్‌లో తలపడుతోంది. జోఫ్రా ఆర్చర్ ఈ మ్యాచుకు దూరమయ్యాడు. కాగా భారత్ ఇటీవల ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌లో చిత్తుగా ఓడిపోయింది. రెండు మ్యాచ్‌లలోనూ ఓడిపోయి.. చరిత్రలో తొలిసారి ఐర్లాండ్ చేతిలో సిరీస్ కోల్పోయింది. దీంతో ఇంగ్లాండ్‌తో ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# స్వీడన్‌పై ఫ్రాన్స్ ఘన విజయం

ఫిఫా ప్రపంచకప్ 2026లో ఫ్రాన్స్ జట్టు సరికొత్త రికార్డులతో దూసుకుపోతోంది. న్యూయార్క్ వేదికగా జరిగిన 'రౌండ్ ఆఫ్ 32' నాకౌట్ మ్యాచ్‌లో స్వీడన్‌పై ఫ్రాన్స్ 3-0 తేడాతో ఘనవిజయం సాధించి రౌండ్ ఆఫ్ 16 కి అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ కెప్టెన్ కలియన్ ఎంబాపె రెండు అద్భుతమైన గోల్స్‌తో చెలరేగి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, తన పేరిట పలు రికార్డులను లిఖించుకున్నాడు. ఎంబాపె పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డోకు వీరాభిమాని. ఫస్ట్ హాఫ్ ముగిసే సమయానికి కొన్ని క్షణాల ముందు మైఖేల్ ఒలిసే, ఉస్మానే డెంబెలే అందించిన పాస్‌ను అందుకుని ఎంబాపె ఫ్రాన్స్ ఖాతాలో మొదటి గోల్ వేశాడు. సెకండ్ హాఫ్ ప్రారంభమైన వెంటనే ఫ్రాన్స్ మరింత దూకుడు పెంచింది. మైఖేల్ ఒలిసే అందించిన పాస్‌తో పారిస్ సెయింట్-జర్మన్ వింగర్ బ్రాడ్లీ బార్కోలా జట్టుకు రెండో గోల్ అందించాడు. మ్యాచ్ మధ్యలో ఒలిసే అందించిన మరో అద్భుతమైన పాస్‌ను ఎంబాపె గోల్‌గా మలిచి ఫ్రాన్స్ విజయాన్ని 3-0 తో ఖాయం చేశాడు. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లలో అత్యధిక గోల్స్ చేసిన తన పాత రికార్డును ఎంబాపె మరింత ముందుకు తీసుకెళ్లాడు. ప్రస్తుతం నాకౌట్ స్టేజ్‌లలో అతని మొత్తం గోల్స్ సంఖ్య 9కి చేరింది. ఈ రెండు గోల్స్‌తో వరల్డ్ కప్ చరిత్రలో ఎంబాపె చేసిన మొత్తం గోల్స్ సంఖ్య 18కి చేరింది. లియోనెల్ మెస్సి ఆల్‌టైమ్ రికార్డు (19 గోల్స్)కు అతను కేవలం ఒకే ఒక్క గోల్ దూరంలో ఉన్నాడు.ఈ టోర్నమెంట్‌లో 6 గోల్స్, రెండు అసిస్ట్‌లతో ఎంబాపె ప్రస్తుతం గోల్డెన్ బూట్ రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.మొదటి గోల్ చేసిన తర్వాత ఎంబాపె నేరుగా వెళ్లి తన మేనేజర్/కోచ్ ను ఆలింగనం చేసుకున్నాడు. ఇటీవలే తన తల్లి అంత్యక్రియలకు హాజరై తిరిగి వచ్చిన కోచ్‌కు ఈ గోల్ ద్వారా జట్టు మొత్తం తమ మద్దతును, ఐక్యతను చాటిచెప్పింది. ఫ్రాన్స్ జట్టు ఈ ప్రపంచకప్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌లలోనూ విజయం సాధించి, 13 గోల్స్ చేసి కేవలం 2 గోల్స్ మాత్రమే సమర్పించుకుని అజేయంగా నిలిచింది. రౌండ్ ఆఫ్ 16 లో ఫ్రాన్స్ జట్టు పరాగ్వే తో తలపడనుంది. జర్మనీని పెనాల్టీ షూటౌట్‌లో ఓడించి పరాగ్వే రౌండ్ ఆఫ్ 16 కి దూసుకొచ్చింది. అంతకుముందు జరిగిన మరొక రౌండాఫ్ 32 మ్యాచ్‌లో ఐవరీ కోస్ట్‌పై నార్వే విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో నార్వే 2-1తో ఐవరీ కోస్ట్‌పై గెలిచి ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించింది.

# ఈక్వెడార్ ను 2-0తో చిత్తు చేసిన మెక్సికో



ఫిఫా వరల్డ్ కప్ 2026 రౌండ్ ఆఫ్ 32 నాకౌట్ మ్యాచ్ లో కో-హోస్ట్ మెక్సికో సంచలన విజయం సాధించింది. మంగళవారం తమ ఐకానిక్ అజ్టెకా స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్ లో ఈక్వెడార్ ను 2-0 తేడాతో ఊచకోత కోసింది. ఈ బిగ్ విక్టరీతో మెక్సికో ఏకంగా 40 ఏళ్ల నాకౌట్ శాపాన్ని బద్దలు కొట్టింది. లాస్ట్ టైమ్ మెక్సికో 1986 లో తాము వరల్డ్ కప్ ఆర్గనైజ్ చేసినప్పుడు మాత్రమే నాకౌట్ మ్యాచ్ లో గెలిచింది, ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే ఆ మ్యాజిక్ రిపీట్ అయింది. తుఫాను వాతావరణం వల్ల మ్యాచ్ ఒక గంట లేట్ గా స్టార్ట్ అయినప్పటికీ హోమ్ టీమ్ ప్లేయర్లు గ్రౌండ్ లోకి రాగానే అటాకింగ్ గేమ్ తో ఈక్వెడార్ ను వణికించారు. మ్యాచ్ స్టార్టింగ్ నుంచే మెక్సికో ఫుల్ డామినేషన్ చూపించింది. 17 ఏళ్ల వండర్ కిడ్ గిల్బెర్టో మోరా ఈ మ్యాచ్ ప్లేయింగ్ ఎలెవన్ లో ఛాన్స్ దక్కించుకుని, 1958 లో పీలే తర్వాత వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్ లో ఆడిన సెకండ్ యంగెస్ట్ ప్లేయర్‌గా హిస్టరీ క్రియేట్ చేశాడు. మ్యాచ్ 22వ నిమిషంలో రోబెర్టో అల్వారాడో ఇచ్చిన పాస్ ను అందుకున్న జూలియన్ క్వినోన్స్ లెఫ్ట్ వింగ్ నుంచి దూసుకెళ్లి ఈక్వెడార్ కీపర్ హెర్నాన్ గాలిండెజ్ ను దాటించి ఒక మైండ్ బ్లోయింగ్ గోల్ కొట్టాడు. దీంతో స్టేడియం అంతా ఫ్యాన్స్ అరుపులతో హోరెత్తిపోయింది. ఆ తర్వాత 30వ నిమిషంలో జూలియన్ ఇచ్చిన అద్భుతమైన అసిస్ట్ తో ఫుల్హామ్ స్ట్రైకర్ రావుల్ జిమెనెజ్ బాల్ ను టాప్ కార్నర్ లోకి రాకెట్ లా పంపి మెక్సికోకు 2-0 లీడ్ ఇచ్చాడు. సెకండ్ హాఫ్ లో ఈక్వెడార్ కోచ్ సెబాస్టియన్ బెక్కాసెక్ చాలా చేంజెస్ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మెక్సికో డిఫెండర్ సీజర్ మోంటెస్. ఈక్వెడార్ అటాక్ ను పక్కాగా బ్లాక్ చేశాడు. ఈక్వెడార్ ప్లేయర్ జాన్ యెబోవా కొట్టిన కొన్ని షాట్లను మెక్సికో కీపర్ రావుల్ రాంజెల్ సూపర్ సేవ్స్ తో అడ్డుకున్నాడు. ఈ టోర్నీలో ఫ్రాన్స్, అర్జెంటీనాలతో పాటు గ్రూప్ స్టేజ్ లో ఆడిన మూడు మ్యాచులూ గెలిచిన ఏకైక థర్డ్ టీమ్ మెక్సికో కావడం విశేషం, పైగా ఇప్పటివరకు ఒక్క గోల్ కూడా సమర్పించుకోకుండా క్లీన్ షీట్ మెయింటైన్ చేస్తోంది. మ్యాచ్ లాస్ట్ మినిట్స్ లో ఈక్వెడార్ ప్లేయర్ పీరో హింకాపీ అంపైర్ తో గొడవపడి రెడ్ కార్డ్ తెచ్చుకోవడంతో వారి కథ కంప్లీట్‌గా ముగిసింది. అజ్టెకా స్టేడియంలో ఆడిన లాస్ట్ 10 వరల్ కప్ మ్యాచుల్లో మెక్సికోకు ఇప్పటివరకు ఓటమనేదే లేదు. 1970, 1986 వరల్డ్ కప్ ఫైనల్స్ కు హోస్ట్ గా ఉన్న ఈ గ్రౌండ్ సెంటిమెంట్ ఆదివారం జరగబోయే రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్ లోనూ తమను గెలిపిస్తుందని మెక్సికో ఫ్యాన్స్ ఫుల్ కాన్ఫిడెన్స్ తో ఉన్నారు. నెక్ట్స రౌండ్ లో ఇంగ్లాండ్ లేదా డీఆర్ కాంగో టీమ్ తో మెక్సికో తలపడనుంది. క్వార్టర్ ఫైనల్స్ నుంచి జరగబోయే వరల్డ్ కప్ మ్యాచ్ లన్నీ కంప్లీట్‌గా యునైటెడ్ స్టేట్స్ (అమెరికా) లోనే జరగబోతున్నాయని, కాబట్టి హోమ్ గ్రౌండ్ లో ఆడే లాస్ట్ మ్యాచ్ లో ఈక్వెడార్ ను దెబ్బకొట్టడం చాలా హ్యాపీగా ఉందని మెక్సికో ఫ్యాన్స్ అంటున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

# షూటింగ్ చేస్తూ ఎంబీబీఎస్ పరీక్షలు రాశా: శ్రీలీల



నటి శ్రీలీల తన సినీ కెరీర్‌తో పాటు వైద్య విద్యను ఎలా కొనసాగించిందో వెల్లడించింది. 'డాక్టర్స్ డే' సందర్భంగా మాట్లాడుతూ 'వైరల్ వయ్యారి' పాట చిత్రీకరణ జరుగుతున్న సమయంలో కూడా ఎంబీబీఎస్ పరీక్షలకు ప్రాధాన్యం ఇచ్చానని తెలిపింది. "డాక్టర్ కావడం నా చిన్ననాటి కల. అదే నా అతిపెద్ద అభిరుచి. 'వైరల్ వయ్యారి' షూటింగ్ జరుగుతున్న సమయంలో కూడా నా ఎంబీబీఎస్ పరీక్షలకే మొదటి ప్రాధాన్యం ఇచ్చాను. షూటింగ్ పూర్తయ్యాక వెంటనే ప్రాక్టికల్స్‌కు వెళ్లేదాన్ని. మధ్యలో విరామం దొరికితే మళ్లీ సెట్స్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొనేదాన్ని. ఇది అంత సులభం కాదు. కానీ వైద్య విద్య నాకు ఎంతో విలువైనది" అని శ్రీలీల చెప్పింది. 'వైరల్ వయ్యారి' పాట 'జూనియర్' సినిమాలోనిది. ఈ చిత్రంలో కిరీటి రెడ్డి హీరోగా నటించగా, దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. రాధా కృష్ణ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సాయి కొర్రపాటి నిర్మించారు. ప్రస్తుతం శ్రీలీల పలు భాషల్లో వరుస చిత్రాలతో బిజీగా ఉంది. తెలుగు చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్', తమిళ చిత్రం 'పరాశక్తి', అలాగే అనురాగ్ బసు దర్శకత్వంలో కార్తీక్ ఆర్యన్‌తో కలిసి ఓ హిందీ రొమాంటిక్ మ్యూజికల్ చిత్రంలో నటిస్తోంది.

# ఢిల్లీ హైకోర్టులో ఇళయరాజాకు ఎదురుదెబ్బ



ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజాకు 134 సినిమాల పాటల యాజమాన్య హక్కులకు సంబంధించిన కాపీరైట్ వివాదంలో ఢిల్లీ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో గతంలో జారీ చేసిన మధ్యంతర నిషేధాజ్ఞను ఎత్తివేయాలని ఆయన దాఖలు చేసిన అభ్యర్థనను కోర్టు పూర్తిగా తిరస్కరించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న మధ్యంతర ఉత్తర్వులు యథాతథంగా కొనసాగనున్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ వివాదంలో ప్రముఖ సంగీత సంస్థ 'సారేగామా' రంగంలోకి దిగి, ఆ 134 చిత్రాల్లోని పాటలపై పూర్తి కాపీరైట్ హక్కులు తమకే ఉన్నాయని, తాము చట్టబద్ధంగానే వాటిని పొందామని కోర్టుకు తెలిపింది. మరోవైపు, సదరు సినిమాలకు తానే ప్రాణం పోశానని, తాను స్వరపరిచిన పాటలపై మరెవరికో హక్కులు ఉండటం ఏంటని, వాటిపై తనకు కూడా పూర్తి అధికారాలు ఉంటాయని ఇళయరాజా గట్టిగా వాదిస్తున్నారు. ఈ కాపీరైట్ అంశంపై ఇరు పక్షాల మధ్య గత కొంతకాలంగా న్యాయపోరాటం నడుస్తోంది. మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలన్న ఇళయరాజా అప్పీల్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ ఆదేశాలను ఎత్తివేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. ఈ కాపీరైట్ వివాదంపై పూర్తిస్థాయి విచారణ జరిగి, తుది తీర్పు వెలువడే వరకూ ప్రస్తుతం అమల్లో ఉన్న మధ్యంతర ఉత్తర్వులే కొనసాగుతాయని వెల్లడించింది. భారతీయ సంగీత పరిశ్రమలో ఒకేసారి ఇన్ని సినిమాల పాటల హక్కులపై వివాదం రేగడం ఇదే మొదటిసారి కావడంతో, ఈ కేసు తుది తీర్పు భవిష్యత్తులో కాపీరైట్ చట్టాల విషయంలో అత్యంత కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# 'హైలెస్సో'లో శివాజీ పాత్ర రివీల్.. విలన్‌గా 'లైలం బాబు' లుక్ విడుదల

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న 'హైలెస్సో' సినిమా నుంచి మరో కీలక అప్‌డేట్ వచ్చింది. నటుడు శివాజీ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. సినిమాలో ఆయన పాత్ర పేరును కూడా వెల్లడించింది. ఈ చిత్రంలో శివాజీ 'లైలం బాబు' అనే శక్తిమంతమైన విలన్ పాత్రలో కనిపించనున్నారు. 'ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే అత్యంత పవర్‌ఫుల్ పాత్రలో త్వరలో పెద్ద తెరపై కనిపిస్తారు' అంటూ చిత్ర నిర్మాణ సంస్థ వజ్ర వారాహి సినిమాస్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఇటీవల 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఏ నోబడీ' చిత్రంలో తన నటనతో ఆకట్టుకున్న శివాజీ, ఈ సినిమాలోనూ మరోసారి ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. దర్శకుడు ప్రసన్న కుమార్ కోటకు ఇది తొలి చిత్రం. గతేడాది సెప్టెంబర్‌లో సంప్రదాయ పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది సుడిగాలి సుధీర్‌కు హీరోగా ఐదో సినిమా. ఇప్పటికే హీరోయిన్ నక్షా శరణ్ పోషిస్తున్న 'జెస్సీ' పాత్రను కూడా చిత్రబృందం పరిచయం చేసింది. నటాషా సింగ్, నక్షా శరణ్ కథానాయికలుగా నటిస్తుండగా, కన్నడ నటి అక్షర గౌడ కీలక పాత్ర పోషిస్తున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బేవర దుహిత శరణ్య కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వ్యవసాయ కుటుంబాల్లో తరచూ వినిపించే స్థానిక పలుకుబడి నుంచే 'హైలెస్సో' అనే టైటిల్‌ను తీసుకున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో గ్రామీణ సంప్రదాయాలు, ఆచారాలు, త్యాగం, సంఘర్షణ వంటి అంశాలను ప్రతిబింబిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తుండగా, సుజాత సిద్ధార్థ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎడిటర్‌గా ఛోటా కె. ప్రసాద్, రచయితగా చింతా శ్రీనివాస్ పని చేస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు.



# అఖిల్ 'లెనిన్'.. కలిసొస్తుందా?



అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన లెనిన్ సినిమా ట్రైలర్ విడుదలైన తర్వాత సోషల్ మీడియాలో భారీ చర్చ మొదలైంది. చాలా కాలంగా సరైన విజయాన్ని ఎదురుచూస్తున్న అఖిల్ కు సినిమా కీలకంగా మారడంతో ట్రైలర్ పై అందరి దృష్టి పడింది. అయితే ట్రైలర్ కు వస్తున్న రెస్పాన్స్ లో ఆసక్తికరమైన అంశం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అదే.. సినిమా కథను ట్రైలర్ లోనే ఎక్కువగా చూపించారా? అనే చర్చ. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందిన ఆ సినిమా రాయలసీమ పొలిటికల్ బ్యాక్ డ్రాప్ లో సాగే యాక్షన్ డ్రామాగా కనిపిస్తోంది. ట్రైలర్ లో అఖిల్ ను గతంలో కనిపించని రా అండ్ రస్టిక్ లుక్ లో చూపించారు. స్థానిక యాస, మాస్ యాక్షన్, ఎమోషనల్ సీన్స్, తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ట్రైలర్ కు బలం చేకూర్చాయి. దీంతో సినిమా కమర్షియల్ గా మంచి స్థాయిలో ఉండొచ్చనే అభిప్రాయం ప్రేక్షకుల్లో ఏర్పడింది

అయితే ట్రైలర్ ను మరో యాంగిల్ లో చూసేవాళ్లు మాత్రం భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కథలో కీలక జర్నీ దాదాపు మొత్తం ట్రైలర్ లోనే చూపించారని వారు అంటున్నారు. హీరో సాధారణ వ్యక్తిగా కనిపించడం, అతని జీవితంలో విషాదం, ఆ తర్వాత రివెంజ్ కోసం చేసే పోరాటం, చివరికి మెయిన్ విలన్ తో తలపడే స్థాయి వరకు కథ ఎలా సాగుతుందో ట్రైలర్ చూస్తేనే అర్థమవుతోందని అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా ట్రైలర్ అంటే ఆసక్తి పెంచాలి కానీ కథ మొత్తాన్ని చెప్పకూడదని చాలామంది భావిస్తారు. ముఖ్యంగా థ్రిల్లింగ్ మూమెంట్స్, ట్విస్టులను దాచిపెడితేనే ప్రేక్షకుడు థియేటర్ కు వెళ్లినప్పుడు కొత్త అనుభూతి పొందుతాడని చెబుతుంటారు. ఈ నేపథ్యంలో లెనిన్ ట్రైలర్ మాత్రం ఆ సస్పెన్స్‌కు పెద్దగా అవకాశం ఇవ్వలేదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. మరోవైపు దీనిని మేకర్స్ ప్లాన్ దా తీసుకుని ఉండొచ్చనే అభిప్రాయమూ ఉంది. ఇటీవల ఆడియన్స్ స్టార్ హీరోలు చూసి థియేటర్లకు రావడం లేదు. కథలో బలం ఉందనే నమ్మకం కలిగితేనే వెళ్లాలని నిర్ణయించుకుంటున్నారు. అందుకే కథలోని ఎమోషన్ ను ముందుగానే చూపించి ప్రేక్షకుల్లో విశ్వాసం పెంచాలనే ఉద్దేశంతో ట్రైలర్‌ను కట్ చేసి ఉండొచ్చని కొందరు చెబుతున్నారు. అయితే ఇలాంటి ప్రయత్నం సక్సెస్ కావాలంటే సినిమా ఎగ్జిక్యూషన్ చాలా బలంగా ఉండాలి. ట్రైలర్ లో కనిపించిన సీన్స్ కంటే థియేటర్ లో మరింత ఎఫెక్టివ్ ట్రీట్మెంట్, ఎమోషన్స్, యాక్షన్ ఎలివేషన్స్ ఉంటేనే ప్లాన్ వర్కౌట్ అవుతుంది. లేదంటే ప్రేక్షకుడు ముందే కథ అర్థమైపోయిందనే భావనతో కొంత నిరాశ చెందే అవకాశమూ ఉంటుంది. ఏదేమైనా ఇప్పుడు లెనిన్ ట్రైలర్ సినిమా గురించి అందరూ మాట్లాడుకునేలా చేసింది.

# యశ్ 'టాక్సిక్' నుంచి పవర్‌ఫుల్ గ్లింప్స్.. ఇది పెద్దలకు మాత్రమే!




రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. ఈ సినిమా నుంచి తాజాగా ఓ ఆసక్తికరమైన గ్లింప్స్ వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల చేసింది. 'లేడీస్ & లేడీస్' పేరుతో రిలీజ్ చేసిన ఈ వీడియో, సినిమాలోని మహిళా పాత్రలను ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఈ వీడియో సినిమాలోని డార్క్, స్టైలిష్ ప్రపంచాన్ని ఆవిష్కరించింది. పవర్, మిస్టరీ, యాటిట్యూడ్‌తో నిండిన ఈ గ్లింప్స్‌లో హీరోయిన్ల లుక్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా, "పిల్లలు దూరంగా ఉండండి.. తల్లిదండ్రులు మీ పిల్లలను దూరంగా ఉంచండి.. తాతయ్యలు, మీ మనవళ్లను దూరంగా ఉంచండి.. ముత్తాతలు, మీ సొంత రిస్క్‌తో చూడండి" అంటూ వీడియో మొదట్లోనే ఇచ్చిన హెచ్చరిక, సినిమా ఎంత బోల్డ్‌గా, వైల్డ్‌గా ఉండబోతుందో స్పష్టం చేసింది. ఈ వీడియోలో కనిపించిన నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి తమ ప్రజెన్స్‌తో ప్రతి ఫ్రేమ్‌ను డామినేట్ చేశారు. నయనతార ఎంతో తీవ్రమైన, దృఢమైన పాత్రలో కనిపిస్తుండగా, కియారా అద్వానీ ఆకర్షణీయమైన, విషాదభరితమైన ఎనర్జీతో ఆకట్టుకుంది. అలాగే, తారా సుతారియా ఉల్లాసంగా, రుక్మిణి వసంత్ తీవ్రమైన లుక్‌లో, హ్యూమా ఖురేషి ఆకర్షణీయమైన స్టీలీ గ్లింప్స్‌తో తమ పాత్రల తీరును తెలియజేశారు. దీనికి తోడు ఓ మహిళ చెప్పే వాయిస్ ఓవర్ వీడియోకి మరింత మిస్టరీని జోడించింది. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరిస్తున్నారు. అనంతరం హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్ట్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613